మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 217 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## మహారాష్ట్ర, జార్ఖండ్‌లకు పరిశీలకులగా భట్టి, ఉత్తమ్, సీతక్క

### నియమించిన కాంగ్రెస్ అధిష్టానం



**న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):** మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రెండు రాష్ట్రాల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ పరిశీలకులను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ మంగళవారం మధ్యాహ్నం ఉత్తర్వులు జారీ చేసింది. జార్ఖండ్‌కు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు ఆ పార్టీ సీనియర్ నేతలు తారిక్ అన్వర్, అధిర్ రంజన్ చౌదరిని నియమించారు. ఇక మహారాష్ట్రలోని 5 డివిజన్లకు 11 మంది పరిశీలకులను నియమించగా.. అందులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్కకు బాధ్యతలు అప్పగించారు.

# దేశ రక్షణలో రాజకీయాలొద్దు

### పార్టీలకతీతంగా దేశాభివృద్ధిలో కలిసిసాగుదాం



- దామగుండం రిజర్వు ఫారెస్టులో రాడార్ స్టేషన్ నిర్మాణానికి,సీఎం రేవంత్‌తో కలిసి శంకుస్థాపన
- రక్షణరంగ పరికరాల తయారీలో ఖ్యాతిగడించిన హైదరాబాద్
- దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకం
- ప్రాజెక్టుకు ఏర్పాటుకు అన్ని విధాలా అండగా నిలిచిన ముఖ్యమంత్రికి అభినందనలు
- అబ్దుల్ కలాం జయంతి నాడు ప్రారంభించిడం ఆనందంగా ఉందన్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పిలుపు

**హైదరాబాద్, (ప్రజా మంటలు):** పార్టీలు వేరైనా దేశాభివృద్ధిలో అందరూ కలిసి ముందుకెళ్లాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వు ఫారెస్టులో రాడార్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సభలో రక్షణ మంత్రి ప్రసంగించారు.అబ్దుల్ కలాం జయంతి నాడు వీఎల్ఎఫ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రాజెక్టుకు ఏర్పాటుకు అన్ని విధాలా అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు గొప్ప పేరుందని, దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకంగా మారిందన్నారు. దేశ భద్రత విషయంలో వీఎల్ఎఫ్ పాత్ర కీలకమన్నారు. కమ్యూనికేషన్ విషయంలో ఈ కమాండ్ సెంటర్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు."కమ్యూనికేషన్ విషయంలో భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలి. సాంకేతికయుగంలో కమ్యూనికేషన్ అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. కమ్యూనికేషన్ రంగంలో పావురాలు, గుర్రాల నుంచి ఇక్కడి వరకు వచ్చాం. తపాలా వ్యవస్థను అనేక ఏళ్లుగా వినియోగించుకున్నాం. ఇప్పుడంతా ఇంటర్నెట్ యుగం.. సమాచారం క్షణాల్లో చేరుతోంది. సమాచార విప్లవం.. ఇవాళ అనేక దేశాలను దగ్గర చేస్తోంది. విద్య, వైద్య రంగాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఇంట్లో కూర్చునే అనేక కోర్సులు నేర్చుకునే అవకాశం వచ్చింది.

మిగతా 2లో..

## దేశరక్షణలో మరో కీలక ముందడుగు



- ఈ విషయంలో రాజకీయాలు చేయం.. చేయనివ్వం
- తెలంగాణకు మూడు వైపులా సముద్రం ఉంది
- హైదరాబాద్ దేశ రక్షణకు సంబంధించి కీలకమైన నగరం
- శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, (ప్రజా మంటలు):** రాజకీయాలకతీతంగా రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పని చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలో అతిపెద్ద రాడార్ స్టేషన్ గా పూడూరు మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రం నిలుస్తుందని సీఎం అన్నారు. వికారాబాద్ జిల్లా పూడురు మండలంలో భారత నేవీ ఏర్పాటు చేస్తోన్న రాడార్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాడార్ స్టేషన్ కు భూమిపూజ చేసిన అనంతరం సీఎం మాట్లాడుతూ దేశ భద్రత విషయంలో హైదరాబాద్ వ్యూహాత్మక ప్రాంతమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాడార్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. "మన పార్టీలు వేరు కావొచ్చు.. సిద్ధాంతాలు వేరు కావొచ్చు. దేశ భద్రత, రక్షణ విషయంలో మేం ఎప్పుడూ మీతో కలిసి వస్తాం. దేశ రక్షణ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు మంచి పేరుంది. వీఎల్ఎఫ్ ఏర్పాటుకు అత్యంత వ్యూహాత్మక ప్రాంతం వికారాబాద్ జిల్లా. కొందరు లేనిపోని ఆరోపణలు

మిగతా 2లో..

# ఎన్నికల్లో ఉచితాలపై పిటిషన్..

### ఈసీ,కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):** ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలపై అత్యున్నత న్యాయస్థానంలో ఓ పిటిషన్ దాఖలైంది. ఈ క్రమంలో కేంద్రంతో పాటు, భారత ఎన్నికల సంఘానికి సుప్రీం నోటీసులు జారీ చేసింది.ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచితాల హామీలను లంచాలుగా పరిగణించాలని కోరుతూ బెంగళూరుకు చెందిన ఓ న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు ఉచిత వాగ్దానాలు చేయకుండా నిరోధించడానికి చర్యలు తీసుకునేలా పోల్ ప్యానెల్‌ను ఆదేశించాలని అందులో కోరారు. ఈ ఉచితాల కారణంగా ప్రభుత్వ ఖజానాపై అధిక భారం పడుతుందని అభ్యర్థనలో వెల్లడించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను పరిశీలించింది. ఇదే అంశంపై పెడింగ్‌లో ఉన్న పలు కేసులతో కలిపి దీన్ని విచారించాలని సుప్రీం నిర్ణయించింది. ఈ క్రమంలోనే కేంద్రానికి, ఈసీకి నోటీసులు జారీ చేశారు.పిటిషనర్ తరఫు న్యాయవాది విజయ్ హన్సారియా ఈ అంశంపై అత్యవసర విచారణ జరపాలని కోరారు. అదేవిధంగా ఎన్నికల ముందు ఉచిత వాగ్దానాలు ఓటర్లపై తీవ్ర ప్రభావితం చూపడంతో పాటు ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను దెబ్బతీస్తున్నాయని న్యాయస్థానంలో పేర్కొన్నారు.



## గ్రూప్ వన్‌కు లైన్ క్లియర్

### పిటిషన్లను కొట్టేసిన హైకోర్టు

**హైదరాబాద్, (ప్రజా మంటలు):** గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్ అయ్యింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పిటిషన్లను హైకోర్టు

మిగతా 2లో..

- 21 నుంచి యథావిధిగా 'మెయిన్స్'
- నిర్వహణకు టీజీఎస్పీఎస్సీ ఏర్పాట్లు
- పరీక్ష రాయనున్న 31,382 మంది అభ్యర్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

## గ్లోబల్ డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించండి

- సమాచారం లీకేజీకి ఆస్కారం లేదు
- 'ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లు
- టెలీకమ్యూనికేషన్ స్టాండరైజేషన్ అసెంబ్లీని ప్రారంభించిన మోడీ




**న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):** నాలుగేళ్లకు ఒకసారి జరిగే వరల్డ్ టెలీకమ్యూనికేషన్ స్టాండరైజేషన్ అసెంబ్లీ-2024 ఈవెంట్ ఈ ఏడాది దిల్లీలో అట్టహాసంగా మొదలైంది. ఈ ఈవెంట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లను పరిశీలించారు. దేశీయ ఆవిష్కరణలు ప్రదర్శించేందుకు నిర్వహించే ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ ఈవెంట్ 8వ ఎడిషన్‌ను కూడా ఈ కార్యక్రమంలోనే నిర్వహించారు. ఈ సందర్భంగా డేటా సెంటర్ల గురించి రిలయన్స్ జియో ఛైర్మన్ ఆకాశ్ అంబానీ ప్రస్తావించారు. 'ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లను భారత్‌లో నెలకొల్పే సామర్థ్యం ఉన్నందున అవి దేశంలోనే ఉండాలని ఆకాశ్ అన్నారు. డేటా సెంటర్ పాలసీ 2020 ముసాయిదాను నవీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో భారత్‌లోని డేటా మొత్తం ఇక్కడి డేటా సెంటర్‌లోనే ఉంటుందన్నారు. భారత్ ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆకాశ్ అంబానీ అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం..

మిగతా 2లో..




## డిఎస్సీ కౌన్సిలింగ్ యధాతథం

- సాంకేతిక సమస్య పరిష్కారం కావడంతో తొలగిన అడ్డంకులు
- హాజరు కావాలంటూ అభ్యర్థులకు సమాచారం

**హైదరాబాద్, (ప్రజా మంటలు):** డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టింగ్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్లు మంగళవారం ఉదయం

మిగతా 2లో..

## ప్రజా నాడి




### మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలకు

# మోగిన నగారా

### షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ




మహారాష్ట్రకు నవంబర్ 20న పోలింగ్

జార్ఖండ్‌లో నవంబర్ 13, 20 తేదీల్లో రెండు దశల్లో

రెండు లోక్‌సభ, 48 శాసనసభ స్థానాల్లో ఉప ఎన్నికలకూ షెడ్యూల్ విడుదల

వార్తా 2లో..



## తీరు మారని కెనడా

- భారత్‌పై ఆంక్షలకు సిద్ధమంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు
- ట్రూడో ఆరోపణల్లో నిజం లేదన్న భారత్

**న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):** ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య జరిగిన దగ్గరి నుంచి భారత్‌తో కయ్యానికి కాలు దువ్వుతోన్న కెనడా.. తన బుద్ధి మార్చుకోవడం లేదు. ఇప్పుడు ఏకంగా భారత్‌పై ఆంక్షలకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. ఆ దేశ విదేశాంగ మంత్రి మెలానీ జోలీ ఆ అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేశారు. నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామంటూ రెచ్చగొట్టేలా స్పందించారు. నిజ్జర్ హత్య కేసు అనుమానితుల

మిగతా 2లో..

### పొలీట్రిక్స్

ప్రశ్నించే తత్వవేత్త
సాయిబాబా ప్రొఫెసర్,
పౌరహక్కుల కొరకు
పాటుపడ్డ మీకు
జోహార్ !

చేయని నేరాలకు జైల్లో
మగ్గిన మహనీయుడు,

- న్యాలకంటి నారాయణ
9346200066

మొదటి పేజీ తరువాయి

# దేశ రక్షణలో రాజకీయాలొద్దు

వీఎల్ఎఫ్‌కు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.నావికారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవడం అనివార్యం. ఇండోపసిఫిక్ ప్రాంతంలో పుష్కలంగా ఖనిజ సంపద ఉంది. సముద్రంపై ఆధిపత్యం సాధించిన వాళ్లే మరింత అభివృద్ధి చెందుతారు. సముద్రంపై ఆధిపత్యం ఆంగ్లేయుల విస్తరణకు ఎంతో ఉపయోగపడింది. అత్యాధునిక పరికరాల ద్వారా రక్షణరంగాన్ని బలోపేతం చేస్తాం. దేశ రక్షణ విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోము. దేశ రక్షణ, భద్రత విషయంలో ఎలాంటి ఒత్తిళు వచ్చినా వెనక్కి తగ్గం. వీఎల్ఎఫ్ వల్ల స్థానికులపై ఎలాంటి చెడు ప్రభావం ఉండదు. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి" అని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు.

# దేశరక్షణలో మరో కీలక ముందడుగు

చేస్తూ వివాదాలకు తెరలేపుతున్నారు. దేశ భద్రత ప్రాజెక్టులకు రాజకీయం చేయడం సరికాదు. ఈ ప్రాజెక్టుకు భారాస ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చింది. దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయనివ్వం" అని రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ రక్షణలో తెలంగాణ భాగస్వామ్యం కీలకమన్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌కు సిఎం రేవంత్ ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ దేశ రక్షణకు సంబంధించి కీలకమైన నగరం. తెలంగాణకు మూడు వైపులా సముద్రం ఉంది. ఇక్కడ వీఎల్ఎఫ్ నిర్మాణంతో సముద్ర ప్రాంతం నుంచి చొరబడే ముష్కరుల నుంచి రక్షణ లభిస్తుంది. ఈ స్టేషన్ తో అనర్థాలు జరుగుతాయని కొందరు అపోహలు కలిగించే ప్రయత్నం చేశారు. కానీ తమిళనాడులో 34 ఏళ్లుగా ఉంది. అక్కడ ఎలాంటి ప్రమాదం జరగలేదు. దేశ రక్షణ కోసం రాజీపడొద్దనే ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చారు. దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయం. కేంద్రంతో కలిసి నడుస్తాం. దేశ రక్షణ కోసం పెడుతున్న ప్రాజెక్టులపై రాజకీయం చేసేవారు పునరాలోచించుకోవాలి . రాడార్ స్టేషన్ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఉంటుంది. దేశభద్రత చాలా ముఖ్యం. రాడార్ స్టేషన్ పై కొందరు లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారు. దేశ రక్షణకు సంబంధించిన విషయాన్ని కూడా రాజకీయం చేయడం తగదు. బీఆర్ఎస్ పదేళ్లు అబద్ధాలు చెప్పింది. ఇప్పుడు దేశ రక్షణకు సంబంధించిన అంశంలో కూడా బీఆర్ఎస్ నేతలు అవే అబద్దాలు చెబుతున్నారని సీఎం రేవంత్ విమర్శించారు.

## గ్లోబల్ డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించండి

ఇలా ప్రతి రంగంలోనూ ముందుకెళ్లేందుకు ఏఐ ఓ విప్లవాత్మక సాధనమని పేర్కొన్నారు. అందుకే ఏఐ, మెషిన్ లెర్నింగ్ డేటా సెంటర్‌లు ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉన్న కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. మొదటిసారి భారత్‌లో జరుగుతున్న డబ్ల్యూటీఎస్ఏ కార్యక్రమంలో పాల్గొనేందుకు 190 దేశాల నుంచి 3,000 మంది పారిశ్రామిక, సాంకేతికత నిపుణులు హాజరయ్యారు. 'ది ఫ్యూచర్ ఈ నౌ' థీమ్‌తో నిర్వహిస్తున్న ఈవెంట్‌లో 120కి పైగా దేశాల నుంచి 400కు పైగా ఎగ్జిబిషన్లు, 900కు పైగా స్టార్టప్‌లు ప్రదర్శించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి సింధియా దేశీయ టెలికాం గురించి మాట్లాడారు. భారత్‌లో టెలికాం అనేది కేవలం వినోద మాధ్యమం కాదని బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కీలకమైన సమాచారం, గ్లోబల్ కమ్యూనిటీతో కనెక్ట్ అయ్యే సదుపాయాల కోసం వేగంగా విస్తరించిందన్నారు. 5జీ నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తోందన్నారు. స్పామ్ కాల్స్ పెరుగుతున్న తరుణంలో వీటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రముఖ వ్యాపారవేత్త కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు.

# గ్రూప్ 1 అభ్యర్థులకు శుభవార్త

### - మెయిన్స్‌కు లైన్ క్లియర్

### - పరీక్షలపై పలు పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

డిస్మిస్ చేసింది. వివిధ కారణాలతో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై హైకోర్టులో అభ్యర్థులు పలు పిటిషన్‌లు దాఖలు చేశారు. మంగళవారం ఉదయం ఈ పిటిషన్లపై హైకోర్టులో విచారణకు వచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై దాఖలైన రెండు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. గ్రూప్ 1లో తప్పుడు ప్రశ్నలను తొలగించాలని ఒక పిటిషన్ దాఖలవగా.. ప్రిలిమినరీ కీ లో తప్పులు ఉన్నాయని, కీ ని రీ నోటిఫికేషన్ చేయాలని మరో పిటిషన్‌ను అభ్యర్థులు దాఖలు చేశారు. తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెరిట్ జాబితాను విడుదల చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్ల పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. త్వరలో గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరగబోతున్నాయని ఈ సమయంలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే మెయిన్స్ విద్యార్థులు నష్టపోతారని టీజీపీఎస్సీ కోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు పిటిషన్‌లను కొట్టివేసింది. దీంతో ఈనెల 21 నుంచి గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరుగనున్నాయి. మరోవైపు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు ఈ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 21 నుంచి 27వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలను హెచ్ఎండీఏ పరిధిలో నిర్వహిస్తున్నారు. హాల్‌టికెట్లు పరీక్ష ప్రారంభమయ్యే ఒక రోజు ముందు వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్ష హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అభ్యర్థులను అనుమతించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని స్పష్టంచేశారు. మెయిన్స్‌లో భాగంగా ప్రతి అభ్యర్థి ఆరు పేపర్లకు సంబంధించి పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

# డిఎస్సీ కౌన్సిలింగ్ యధాతథం

### - సాంకేతిక సమస్య పరిష్కారం కావడంతో తొలగిన అడ్డంకులు

### - హాజరు కావాలంటూ అభ్యర్థులకు సమాచారం



విద్యాశాఖ ప్రకటించినప్పటికీ సాంకేతిక సమస్య పరిష్కారం కావడంతో వెంటనే మళ్లీ కౌన్సిలింగ్ ప్రారంభించింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో విద్యాశాఖ కీలక ప్రకటన చేసింది. డీఎస్సీ కౌన్సెలింగ్‌ను మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్ పక్రియలో తలెత్తిన సాంకేతిక సమస్యలను అధికారులు పరిష్కరించారు. దీంతో కౌన్సెలింగ్‌కు వచ్చి వెనుదిరిగిన వారికి ఆయా జిల్లాల డీఈవోలు కౌన్సెలింగ్‌కు రావాలని మళ్లీ సమాచారం ఇచ్చారు.డీఎస్సీ 2024 ద్వారా ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకున్న కొత్త టీచర్లకు మంగళవారం పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. నూతన టీచర్లు ఆయా డీఈఓలు సూచించిన కార్యాలయాల్లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. అయితే సాంకేతిక కారణాలతో కౌన్సెలింగ్ వాయిదా పడింది. కాగా, కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కానీ సమస్య పరిష్కారం కావడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సెలింగ్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

# తీరు మారని కెనడా

### - భారత్‌పై ఆంక్షలకు సిద్ధమంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు

### - ట్రూడో ఆరోపణల్లో నిజం లేదన్న భారత్

జాబితాలో భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మను చేర్చడంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు మళ్లీ భగ్గుమన్నాయి. దీనిపై తాజాగా కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో న్యూదిల్లీపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. నిజ్జర్ హత్య కేసు దర్యాప్తునకు భారత్ సహకరించడం లేదని ఆరోపించారు. అయితే, కెనడా ఆరోపణలు న్యూదిల్లీ ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉంది. ఎలాంటి సాక్ష్యాలు ఇవ్వకుండా ఒట్టావా నిరాధార ఆరోపణలు చేస్తోందని మండిపడింది. ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా కెనడా ప్రభుత్వం మన రాయబారిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, పెద్దఎత్తున

బురద జల్లే ప్రయత్నం చేస్తోందని తీవ్ర పదజాలంతో ఆక్షేపించింది. తాజా పరిణామాల నేపథ్యంలో సంజయ్‌కుమార్ వర్మను, మరికొందరు అధికారుల్ని అక్కడినుంచి వెనక్కి తెచ్చేయాలని కేంద్రం నిర్ణయించింది. దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించాలని కూడా నిర్ణయం తీసుకుంది. వారు ఈనెల 19వ తేదీ రాత్రి 11.59 గంటల్లోగా భారత్‌ను వీడి వెళ్లాలని గడువు విధించింది. ప్రతిగా కెనడా సైతం ఆరుగురు భారత దౌత్యాధికారుల్ని బహిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇది ఇంతటితో ఆగలేదు. ఈసారి గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరును తెరపైకి తెచ్చింది. ఆ గ్యాంగ్‌తో కలిసి భారత ఏజెంట్లు.. ప్రో ఖలిస్థానీలను లక్ష్యంగా చేసుకొని కెనడా భూభాగంపై పని చేస్తున్నారంటూ తీవ్రంగా ఆరోపించింది. తాజాగా ఆ దేశ విదేశాంగ మంత్రి మాట్లాడుతూ ఆంక్షల ప్రస్తావన తెచ్చారు. మరోవైపు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ తో భారత ఏజెంట్లకు సంబంధాలు ఉన్నాయంటూ వ్యాఖ్యానించింది. ఆ గ్యాంగ్‌తో కలిసి భారత ఏజెంట్లు.. ప్రో ఖలిస్థానీలను లక్ష్యంగా చేసుకొని కెనడాలో పని చేస్తున్నారంటూ ఆరోపించింది. 'కెనడాలో ఉన్న భారత ఏజెంట్లు ప్రో ఖలిస్థానీలను లక్ష్యంగా చేసుకొని లారెన్స్ బిష్ణోయ్ ముఠాతో కలిసి పని చేస్తున్నాయి' అని ఆరోపించింది. ఖలిస్థానీ తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసుకు సంబంధించిన దర్యాప్తు పురోగతి వివరాలను రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు సోమవారం రాత్రి మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. భారత ఏజెంట్లు తమ భూభాగంపై హత్యలు, హింసాత్మక కార్యకలాపాలకు (బ।సతినీబీబ ఇ-సతిపతినిజీ జీఇ-బితిలతిబా) పాల్పడుతున్నారంటూ ఆరోపించారు. కెనడాలోని దక్షిణాసియా కమూనిటీని ముఖ్యంగా ప్రో ఖలిస్థానీలను భారత ఏజెంట్లు లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నేర కార్యకలాపాల్లో బిష్ణోయ్ గ్రూప్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఈ గ్యాంగ్‌కు భారత ప్రభుత్వ ఏజెంట్లతో సంబంధాలు ఉన్నట్లు తాము విశ్వసిస్తున్నామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే, ఈ ఆరోపణలకు ఒట్టావా ఎలాంటి ఆధారాలను చూపకపోవడం గమనార్హం.

**ట్రూడో ఆరోపణల్లో నిజం లేదు : భారత్**

కెనడాలో నేర కార్యకలాపాలకు భారత్ మద్దతు ఇస్తోందంటూ ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది. అస్పష్టమైన ఆరోపణలు చేయడం, తిరస్కరిస్తే నిందలు మోపడం వంటి విధానాన్ని కెనడా మొదటి నుంచీ అవలంబిస్తోందని ఆరోపించింది. నిజ్జర్ హత్య కేసుకు సంబంధించి విశ్వసనీయమైన సమాచారాన్ని ఇచ్చామని కెనడా చేస్తున్న వాదనల్లో నిజం లేదని తెలిపింది. గతంలో చేసిన ఆరోపణల్లో భాగంగానే పాత విషయాలను ట్రూడో మళ్లీ తెరపైకి తెచ్చారని విదేశాంగశాఖ వర్గాలు పేర్కొన్నట్లు సమాచారం. "నిజ్జర్ హత్య కేసులో భారత్‌కు విశ్వసనీయమైన సాక్ష్యాధారాలను అందించామన్న కెనడా అధికారుల వాదనలో నిజం లేదు. అస్పష్టమైన ఆరోపణలు చేయడం, తిరస్కరిస్తే భారత్‌పై నిందలు మోపడం.. మొదటి నుంచి కెనడా విధానం ఇదే. దక్షిణాసియా వర్గాలను లక్ష్యంగా చేసుకోవడానికి నేరస్థులను భారత ఏజెంట్లు ఉపయోగించుకుంటున్నారని కెనడా పోలీసుల ఆరోపణలకు సంబంధించి ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. కెనడాలోని భారత హైకమిషనర్‌తో గతేడాది చర్చలు జరిపిన తర్వాత.. ఇప్పుడు ఆయనను ట్రూడో ప్రభుత్వం లక్ష్యంగా చేసుకోవడం అసంబద్ధం" అని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.కెనడా-భారత్ మధ్య తాజాగా చోటుచేసుకున్న పరిణామాలపై స్పందించిన ట్రూడో.. మళ్లీ పాత పాటే పాడారు. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వ ఏజెంట్ల ప్రమేయం ఉందని తమ నిఘా వర్గాలు పేర్కొన్నాయని.. ఇందుకు సంబంధించి ఆధారాలు ఇచ్చామని అన్నారు. ఈ విషయంలో ఏజెంట్లపై చర్యలు, తదితర అంశాలపై చర్చించేందుకు భారత్ సహకరించడం లేదని ఆరోపించారు. ఈ క్రమంలోనే ట్రూడో వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది.

### మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలకు

# మోగిన నగారా

### షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ




**మహారాష్ట్రకు నవంబర్ 20న పోలింగ్**

**జార్ఖండ్‌లో నవంబర్ 13, 20 తేదీల్లో రెండు దశల్లో**

**రెండు లోక్‌సభ, 48 శాసనసభ స్థానాల్లో ఉప ఎన్నికలకూ షెడ్యూల్ విడుదల**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. మహారాష్ట్రలో నవంబర్ 20న ఒకే విడతలో పోలింగ్ జరుపనున్నట్టు సీఈసీ రాజీవ్ కుమార్ ప్రకటించారు. నవంబర్ 23న ఫలితాలు ప్రకటిస్తారు. గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 22న వెలువడుతుంది. నామినేషన్ల గడువు అక్టోబర్ 29వ తేదీతో ముగుస్తుంది. నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 30న జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు నవంబర్ 4వ తేదీతో ముగుస్తుంది. నవంబర్ 25వ తేదీలోగా ఎన్నికలు ముగియాల్సి ఉంటుంది. జార్ఖాడ్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతలుగా జరగనున్నట్టు సీఈసీ ప్రకటించారు. తొలి విడత నవంబర్ 13, రెండో విడత నవంబర్ 20న జరుగుతుంది. తొలి విడత ఎన్నికలకు అక్టోబర్ 18న నోటిఫికేషన్ వెలువడుతుంది. అక్టోబర్ 25తో నామినేషన్ల గడువు ముగుస్తుంది. అక్టోబర్ 28న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 30తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. తొలి విడతలో భాగంగా 43 నియోజకవర్గాలకు నవంబర్ 13న పోలింగ్ జరుగుతుంది. రెండో విడత నోటిఫికేషన్ అక్టోబర్ 22న వెలువడుతుంది. అక్టోబర్ 29తో నామినేషన్ల గడువు ముగుస్తుంది. అక్టోబర్ 30న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు నవంబర్ 1వ తేదీతో ముగుస్తుంది. నవంబర్ 20న రెండో విడత పోలింగ్ జరుగుతుంది. నవంబర్ 23న కౌంటింగ్ జరిపి ఫలితాలు ప్రకటిస్తారు. కాగా, 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 26తో ముగుస్తోంది. ఈలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. 81 స్థానాలున్న జార్ఖాండ్ అసెంబ్లీ గడువు వచ్చే ఏడాది జనవరి 5వ తేదీతో ముగుస్తుంది. మహారాష్ట్రలో బిజీపీ, శివసేన, ఎన్‌సీపీతో కూడిన మహాకూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా, జార్ఖాండ్‌లో జెఎంఎం అధికారంలో ఉంది. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని 9 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల తేదీని కూడా ఎన్నికల కమిషన్ మంగళవారంనాడు ప్రకటించింది. నవంబర్ 13న పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు ప్రకటిస్తారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను కూడా ఇదే రోజు ప్రకటిస్తారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లో ఉప ఎన్నికలు జరుగనున్న 9 అసెంబ్లీ స్థానాల్లో మీరాపూర్, కుందర్కి, ఘజియాబాద్, ఖైర్, కర్హాల్, సిషామౌ, ఫుల్పూర్, కతెహారి, మజవాన్ ఉన్నాయి. వీటిలో నాలుగు స్థానాలను సమాజ్‌వాదీ పార్టీ గెలుచుకోగా, బీజేపీ 3, రాష్ట్రీయ లోక్‌దళ, నిషద్ పార్టీ చెరో స్థానం గెలుచుకున్నాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన ఆయా పార్టీల నేతలు తాము గెలిచిన అసెంబ్లీ స్థానాలను వదులుకోవడంతో యూపీలోని 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి యూపీలో ఎదురుదెబ్బ తగలడంతో ఈ అసెంబ్లీ ఉప ఎన్నికలు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు గట్టి సవాలనే చెప్పాలి.

**ఎగ్జిట్‌పోల్స్‌పై ఆత్మపరిశీలన అవసరం**

**- ఎన్నికల సంఘం కీలక వ్యాఖ్యలు**

ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల సంఘం కీలక వ్యాఖ్యలు చేసింది. వీటికి ఎటువంటి శాస్త్రీయత లేనప్పటికీ భారీ అంచనాలను సృష్టిస్తున్నాయని పేర్కొంది. ఇలాంటి భారీ అంచనాలతో ప్రజల్లో గందరగోళం ఏర్పడుతోందని, ఈ విషయంలో మీడియా సహా భాగస్వామ్య పక్షాలు ఆత్మపరిశీలన చేసుకునే సమయం ఆసన్నమైందని తెలిపింది. మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన సందర్భంగా ఈవిధంగా స్పందించింది. "ఎగ్జిట్‌పోల్స్ తో మాకు సంబంధం ఉండదు. అయితే, శాంపిల్ సైజ్ ఏంటి.,? సర్వేలు ఎక్కడ జరిగాయి. అంచనాలకు అనుగుణంగా ఫలితాలు రాకుంటే మన బాధ్యత ఎంతవరకు? అనే విషయంలో భాగస్వామ్య పక్షాలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. మీడియాకు స్వీయ నియంత్రణ అవసరం" అని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. అంచనాలు, వాస్తవ ఫలితాల మధ్య అంతరమనేది చివరకు నిరాశకు దారితీస్తుందన్నారు. ఇటీవల హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలన్నీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఇవ్వగా.. వాస్తవ ఫలితాలు మాత్రం అందుకు భిన్నంగా వచ్చిన నేపథ్యంలో రాజీవ్ కుమార్ ఇలా స్పందించారు.మరోవైపు హరియాణా ఎన్నికల ఫలితాల సందర్భంగా కాంగ్రెస్ చేసిన ఆరోపణలపైనా ఎన్నికల సంఘం స్పష్టతనిచ్చింది. ముఖ్యంగా ఈవీఎం బ్యాటరీలపై చేసిన ఆరోపణలకు స్పందిస్తూ.. అవి కాలిక్యులేటర్ మాదిరిగానే ఉంటాయని పేర్కొంది. ఈవీఎంలపై వచ్చిన 20 ఫిర్యాదులకు వాస్తవాలతో కూడిన వివరణ ఇస్తామని పేర్కొంది. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు మొదలైన అరగంటలోపే టీవీల్లో ఫలితాలపై విశ్లేషణలు చేయడాన్ని ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రశ్నించారు.



## నవంబర్ 13న వయనాడ్ ఉప ఎన్నిక

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ రాజీనామా నేపథ్యంలో వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక షెడ్యుల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబర్ 13వ తేదీన ఈ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికను నిర్వహించనున్నట్లు సీఈసీ వెల్లడించింది. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్ మంగళవారం న్యూఢిల్లీలో ప్రకటించారు. అదే సమయంలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని అసెంబ్లీ, లోక్‌సభ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను సైతం ఆయన విడుదల చేశారు. ఆ క్రమంలో నవంబర్ 13వ తేదీన వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. రాహుల్ రాజీనామా నేపథ్యంలో ఆయన సోదరి ప్రియాంక అక్కడి నుంచి పోటీ చేస్తారని పార్టీ ఇప్పటికే ప్రకటించింది.

# కుదరదు.. ఏపీకి వెళ్లాల్సిందే..

### - ఐఏఎస్‌లకు క్యాట్ ఆదేశం

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ఈ నెల 9న కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, కె.ఆమ్రపాలి, ఎ.వాణీప్రసాద్, డి.రొనాల్డ్‌రాస్, జి.సృజనలకు కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్)లో ఊరట లభించలేదు. పిటిషన్‌పై విచారణ సందర్భంగా క్యాట్ కీలక వ్యాఖ్యలు చేసింది. "ఏపీలో ప్రజలు వరదలతో ఇబ్బంది పడుతున్నారు. అలాంటి చోటుకు వెళ్లి వారికి సేవ చేయాలని మీకు లేదా? ఐఏఎస్‌ల కేటాయింపులపై డీవోపీటీకి పూర్తి అధికారాలు ఉన్నాయి. స్థానికత ఉన్నప్పటికీ స్వాపింగ్ చేసుకునే అవకాశం గైడ్‌లైన్స్‌లో ఉందా?" అని క్యాట్ ప్రశ్నించింది. వన్ మ్యాన్ కమిటీ సిఫారసులను డీవోపీటీ పట్టించుకోవడం లేదని ఐఏఎస్ అధికారుల తరఫు న్యాయవాది క్యాట్ దృష్టికి తెచ్చారు. సింగిల్‌మెన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా కేంద్రం ఉత్తర్వులు జారీ చేసే ముందు కమిటీ నివేదికను ఇవ్వలేదన్నారు.ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణీప్రసాద్, రొనాల్డ్‌రాస్‌లు కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఏపీకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ఏపీలో పనిచేస్తున్న సృజన తెలంగాణకు రావాల్సి ఉంది. ప్రస్తుతం తాము పనిచేస్తున్న రాష్ట్రంలోనే కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, కేంద్రం జారీ చేసిన కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. కేటాయింపుల సమయంలో కేంద్రం తమ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లోనే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వాదనల అనంతరం .. డీవోపీటీ ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. ఏపీకి వెళ్లాల్సిందేనని స్పష్టం చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# చౌక బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్టేది

## అధికారుల ఆదేశాలు బేఖాతర్

హైదరాబాద్, (ప్రజా మంటలు):



ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సరఫరా చేస్తున్న నిత్యావసర సరకుల అక్రమ రవాణాకు అడుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినా పెద్దగా ప్రయోజనం చేకూరడం లేదు. రూపాయి కిలో బియ్యం ఇప్పుడు పెద్ద వ్యాపారంగా మారింది. పేదలు ఎవ్వరూ రూపాయి బియ్యాన్ని పెద్దగా తినడం లేదు. వివిధ స్థాయిల్లో కొనసాగుతున్న అక్రమ దందాకు చెక్ పెట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని పటిష్టం చేసింది. ప్రస్తుతం పౌరసరఫరాల శాఖకు సంబంధించిన అధికారులు అక్కడక్కడ దాడులు నిర్వహించినప్పటికి పూర్తిస్థాయిలో అక్రమ రవాణా అరికట్టలేక పోతున్నారు. దీంతో అన్ని జిల్లాలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పలు అవినీతి అరోపణలను ఎదుర్కొంటున్న పౌరసరఫరాల శాఖ పనితీరును మెరుగుపరచడంతో పాటు ఆ వ్యవస్థను పటిష్టం చేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ధాన్యం సేకరణలో రైతుకు కనీస మద్దతు ధర, సీఎంఆర్ పథకం కింద బియ్యానికి మెరుగుపెట్టడం, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, ఇతర పథకాలకు పౌరసరఫరాల సంస్థ రైసుమిల్లర్ల నుంచి సన్నబియ్యం కొనుగోలు చేస్తోంది. ఏటా సుమారు రూ. 10 వేల కోట్లకు పైగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్న శాఖలో అధికారులు, సిబ్బంది కొరతతో పాటు నిర్లక్ష్యంతో వందల కోట్ల రూపాయల సరకులు పక్కదారి పడుతున్నాయి. సరకులను పక్కదారి పట్టిస్తున్న అక్రమదారులను గుర్తించినా స్థానిక అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో యథేచ్ఛగా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ఐదు బృందాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు చేస్తూ పౌరసరఫరాల శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రైసుమిల్లుల యాజమానులు, బియ్యం రవాణా గుత్తేదార్లు, చౌక ధరల దుకాణ డీలర్ల అక్రమాలను అరికట్టడమేగాక నాణ్యమైన సరకులను సరఫరా చేయడం కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గట్టిగా పనిచేస్తోంది. పౌర సరఫరాల విభాగంలో వివిధ స్థాయిలో వాటి పనితీరుపై తనిఖీలు నిర్వహిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ గోదాంలను నిరంతరం పరిశీలిస్తారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకున్నా మార్పు రాకుండా అలాగే రవాణా చేస్తే పీడీ యాక్టు కింద కఠిన చర్యలు చేపడతారు. అవసరమైతే రైసుమిల్లర్స్, రవాణా గుత్తేదారులపై చర్యలు తీసుకుంటారు.

# నిస్వార్థ సేవకుడు...మన అబ్దుల్ కలాం

## జయంతి సందర్బంగా నివాళి

చెన్నై,అక్టోబర్15((ప్రజా మంటలు):

నిరాడంబరంగా, నిస్వార్థంగా జీవితం గడపడం అన్నది మహాత్ములకు మాత్రమే సాధ్యం. ఉన్నత పదవుల్లో ఉంటూ అతి సామాన్యంగా జీవితం గడపడం రుషితుల్యులకు మాత్రమే సాధ్యం. అలాంటి వారిలో దివంగత అబ్దుల్ కాలమ్ ఒకరు. ఆయన జీవితం తెరిచిన పుస్తకం. ఎంతో సాదాసీదాగా ప్రజలతో..ప్రజల కోసం జీవించిన మహానుభావుడిగా పేరొందారు. రాష్ట్రపతి పదవిని ఓ సేవకుడిగా భావించి పని చేశారు. పుట్టినప్పుడు ఏమీ లేదని..పోయేప్పుడు ఏమీ ఉండదన్న సత్యం తెలిసిన జ్ఞాని ఆయన. 2002 నుంచి 2007 వరకు భారత రాష్ట్రపతిగా తన సేవలను అందించాడు. భారతరత్న పొందిన రాష్ట్రపతులలో కలామ్ 3వ వారు. ఆయన చేసిన కృషికి భారత ప్రభుత్వం 1981లో పద్మ భూషణ్, పద్మ విభూషణ్‌తో సత్కరించింది. 2015 జూలై 27న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ షిల్లాంగ్‌లో ఉపన్యాసం ఇస్తున్నప్పుడు కలామ్ (83) తీవ్ర గుండెపోటుతో కుప్పకూలి మరణించారు. ఎ.పి.జె. అబ్దుల్ కలాం 1931 అక్టోబరు 15 తమిళ నాడులోని రామేశ్వరంలో పుట్టి పెరిగాడు. అతని పూర్తిపేరు అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలామ్. తండ్రి జైనులబ్దీన్, పడవ యజమాని. తల్లి ఆషియమ్మ గృహిణి. పేద కుటుంబం కావటంతో కుటుంబ అవసరాల కోసం కలామ్ చిన్న వయసులోనే పని చేయడం ప్రారంభించారు. పాఠశాల విద్య పూర్తి చేసిన తర్వాత, తన తండ్రికి ఆర్థికంగా చేదోడువాదోడుగా ఉండటానికి వార్తా పత్రికలు పంపిణీ చేసేవారు. పాఠశాలలో సగటు మార్కులు వచ్చినప్పటికీ నేర్చుకోవ టానికి తపన పడేవాడు. ఎక్కువ సమయం కష్టపడేవాడు. రామనాథపురం స్క్వార్ట్జ్ మెట్రిక్యులేషన్ స్కూల్లో తన పాఠశాల విద్య పూర్తి చేశాక, కలామ్ తిరుచిరాపల్లి లోని సెయింట్ జోసెఫ్స్ కళాశాలలో చేరి, 1954లో భౌతికశాస్త్రంలో, మద్రాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఏరోనాటికల్ ఇంజినీరింగులో పట్టా పొందారు. కలామ్ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డివో) వారి ఏరోనాటికల్ డెవెలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ లో శాస్త్రవేత్తగా చేరాడు. కలామ్ భారత సైన్యం కోసం ఒక చిన్న హెలికాప్టర్ చెయ్యటం ద్వారా తన వృత్తిని ప్రారంభించారు. కానీ డిఆర్‌డివోలో ఉద్యోగం చేయడంతో అతను సంతృప్తి చెందలేదు. తర్వాత భారత అంతరిక్ష పరిశోధనా సంస్థలో (ఇస్రో) చేరి, ఇస్రో మొట్టమొదటి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం తయారీలో పనిచేశాడు. 1980 జులైలో ఈ వాహనం రోహిణి ఉపగ్రహాన్ని భూమి దగ్గర కక్ష్యలో విజయవంతంగా చేర్చింది. 1970, 1990 మధ్య కాలంలో, కలామ్ పిఎస్ఎల్వి, ఎస్ఎల్వి-÷-ఖళఖ్ల ప్రాజెక్టుల అభివృద్ధికి పనిచేశారు. ఈ రెండు ప్రాజెక్టులు విజయవంతం అయ్యాయి. ఎస్ఎల్వి రాకెట్ ఉపయోగించి రోహిణి-1 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపడం ఇస్రో చరిత్రలో మైలురాయి. 1992 జులై నుంచి 1999 డిసెంబరు వరకు ప్రధానమంత్రి శాస్త్ర సలహాదారుగా, డిఆర్‌డివో ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. ఇదే సమయంలో జరిపిన పోఖ్రాన్ అణు పరీక్షల్లో కలాం రాజకీయ, సాంకేతిక పాత్ర నిర్వహించారు. ఈ అణు పరీక్షలు భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చాయి. కలామ్ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందించడంలోనూ కృషిచేశారు.

## నేడు శరత్ పౌర్ణిమ పుణ్య తిథి

## అన్నదానం చేస్తే మంచిదని పురాణోక్తి (ఆధ్మాత్మిక చింతన )

తిరుమల,అక్టోబర్15((ప్రజా మంటలు):

హిందూ మతంలో తిథులు, వారాలు, నక్షత్రాలు, రాశులు ఇలా ఒక్కోదానికి ఒక్క ప్రత్యేకత ఉంది. తిథి వార నక్షత్రాల మేరకు నడచుకోవడం సనాతనంగా వస్తోంది. ప్రతి సంవత్సరం ఆశ్వీయుజ మాసం శుక్ల పక్ష పౌర్ణమిని శరత్ పూర్ణిమగా పేర్కొంటారు. ఈ పూర్ణిమను పలు ప్రాంతాల ప్రజలు పండుగగా చాలా ఉత్సాహంగా జరుపుకుంటారు. ఈ రోజున శ్రీకృష్ణుడు, రాధలతో పాటు శివపార్వతులను పూజించే సంప్రదాయం ఉంది. అంతే కాదు చంద్రుడిని కూడా పుజిస్తారు. శరత్ కాలంలో ఈ రోజున చంద్రుడు 16 కళల్లో ప్రకశిస్తాడని.. చంద్రుని కిరణాలలో అమృతం ఉంటుందని నమ్మకం. ఈ రోజున చేసే పూజకు, స్నానానికి, దానానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. శాస్త్రాల ప్రకారం ఈ రోజున దానధర్మాలు చేయడం ద్వారా లక్ష్మీ దేవి అనుగ్రహాన్ని పొందుతారని న మ్మిక. పంచాంగం ప్రకారం ఆశ్వీయుజ మాసంలోని శుక్ల పక్ష పౌర్ణమి తిథి అక్టోబర్ 16 బుధవారం రాత్రి ప్రారంభమవుతుంది. ఇది మరుసటి రోజు అంటే గురువారం అక్టోబర్ 17 సాయంత్రం 04:53 గంటలకు ముగుస్తుంది. అటువంటి పరిస్థితిలో శరత్ పూర్ణిమ పండుగను అక్టోబర్ 16 న మాత్రమే జరుపుకుంటారు. ఆ రోజు సాయంత్రం చంద్రోదయం జరుగుతుంది. శరత్ పూర్ణిమ రోజున అన్న వితరణ చేయడం మంచిదని నమ్మకం. ఈ రోజున అన్నం సంతర్పణ చేయడం వల్ల లక్ష్మీ దేవిని ప్రసన్నం అవుతుందని ఇంట్లో సుఖసంతోషాలు, శ్రేయస్సు లభిస్తాయని నమ్మకం. బియ్యం శ్రేయస్సు, సంపదలకు చిహ్నంగా పరిగణించబడుతుంది. శరత్ పూర్ణిమ రోజున అన్నవితరణ చేయడం వల్ల లక్ష్మీ దేవి ప్రసన్నురాలై ఇంట్లో సంపద పెరుగుతుంది. అంతే కాదు, శరత్ పూర్ణిమ రోజున అన్నవితరణ చేయడం వల్ల మనిషి జీవితంలోని సమస్యలు తొలగిపోయి మంచి ఫలితాలు లభిస్తాయని పురాణోక్తి

# రోడ్డున పడ్డ ఆడబిడ్డకు లూలూ ఛైర్మన్ అండ

## ఆర్థిక సాయం అందించి ఆదుకున్న యూసుఫ్ అలీ

తిరువనంతపురం,అక్టోబర్15(ప్రజా మంటలు):

ఆసరా కోల్పోయి ఇద్దరు పిల్లలతో ఎటు వెళ్లాలో తెలియక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒక కేరళ మహిళకు బిలియనీర్ లూలూ గ్రూప్ ఛైర్మన్ ఆపన్నహస్తం అందించారు. ఆమె అప్పుకట్టి, మరో పది లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకున్నారు. ఆయనే లులు గ్రూప్ ఛైర్మన్ ఎంఏ యూసుఫ్ అలీ. ఈ వ్యాపారవేత్త చూపిన ఉదారతపై నెట్టింట ప్రశంసల వర్షం కురుస్తోంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. కేరళలోని నార్త్ పరవుర్‌కు చెందిన సంధ్య అనే మహిళ, ఆమె భర్త ఇంటి నిర్మాణం కోసం ఒక ప్రైవేటు సంస్థలో రుణం తీసుకున్నారు. 2019లో రూ.4 లక్షల అప్పు చేశారు. అయితే రెండేళ్ల తర్వాత పిల్లల్ని భార్యను వదిలేసి ఆ భర్త వెళ్లిపోయాడు. దాంతో ఆ అప్పు భారం మొత్తం ఆమెపై పడింది. వడ్డీలు పెరిగి రూ.8 లక్షలైంది. ఆ మొత్తం చెల్లించాలంటూ ఆమెకు నాలుగుసార్లు వార్నింగ్ ఇచ్చామని సదరు సంస్థ వెల్లడించింది. తర్వాత చట్టపరమైన చర్యలు ప్రారంభించింది. బతుకుదెరువు కోసం ఒక దుస్తుల దుకాణంలో పనిచేస్తోన్న ఆమె.. ఇటీవల పనిలోకి వెళ్లిన తర్వాత రుణం ఇచ్చిన సంస్థ ఆ ఇంటిని స్వాధీనం చేసుకుంది. ఆ విషయం తెలిసిన ఆమె.. తన సామాన్లు తీసుకుంటామని అభ్యర్థించినా వారు అంగీకరించలేదు. దాంతో వారు కట్టుబట్టలతో రోడ్డుపై నిలబడాల్సి వచ్చింది. ఈ వ్యవహారం స్థానికుల్లో ఆగ్రహం తెప్పించింది. ఆ వ్యవహారం అంతా మీడియాలో ప్రసారం కావడంతో విషయం యూసఫ్ అలీ దృష్టికి చేరింది. ఆయన తన సిబ్బందిని పంపి రుణం మొత్తం చెల్లించడమే కాకుండా, ఆమెకు రూ.10లక్షల ఆర్థిక సహాయం కూడా చేశారు. లులు గ్రూప్ మీడియా ప్రతినిధి ఆమెకు ఇంటి తాళం చెవి అందజేశారు. ఈ బిలియనీర్ చేసిన సహాయం ప్రతిఒక్కరినీ కదిలించింది. దీనిపై సంధ్య మీడియాతో మాట్లాడుతూ.. తన కుటుంబాన్ని దుర్భరస్థితి నుంచి బయటపడేసిన యూసఫ్ అలీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవలకాలంలో ఈ లులు ఛైర్మన్ స్టోరీలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఎప్పటికప్పుడు తన అభిమానులకు బిగ్ సర్‌ప్రైజ్‌లు ఇస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు. ఇటీవల ఒక అభిమానికి ఖరీదైన వాచ్ ఇచ్చారు. అలాగే ఒక యువతి ఈ బిలియనీర్‌తో సెల్ఫీ తీసుకోవడానికి ప్రయత్నిస్తుండగా అది గమనించిన అలీ ఆమె దగ్గరకు వచ్చి, నవ్వుతూ సరదాగా ఫోటోకు పోజులు ఇచ్చిన సంగతి తెలిసిందే.

## అత్తా కోడళ్లపై సామూహిక అత్యాచారం కేసు

### 48 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

### నిందితులను అరెస్ట్ చేసినట్లు హోంమంత్రి ప్రకటన

అమరావతి, (ప్రజా మంటలు):

సత్యసాయి జిల్లాలో అత్తా కోడళ్ళపై అత్యాచారం చేసిన ఘటనలో 48 గంటల్లో నిందితులను పోలీసులు పట్టుకున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. పోలీసులు సమర్థంగా పనిచేసి నిందితులను పట్టుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ ఘటనలో నిందితులకు వేగంగా శిక్ష పడాలని ఆదేశాలు జారీ చేశారని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ దీనిపై విచారణ కోసం కేసును ప్రత్యేక కోర్టుకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిఘా పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, ఇందులో ప్రజల. భాగస్వామ్యం కూడా కోరుతున్నా మన్నారు. తమ ఇళ్ల వద్ద, వ్యాపార వాణిజ్యం సముదాయాల వద్ద పెట్టుకున్న సీసీ కెమెరాలను పోలీసు శాఖకు అనుసంధానం చేస్తే నేర నియంత్రణ సాధ్యం అవుతుందన్నారు. పోలీసులకు ఆయుధాల్లాగే ప్రజలకు మొబైల్ ఫోన్‌లు కూడా ఉన్నాయని, వాటిని వినియోగించి నేర నియంత్రణకు సహకరించాలని హోంమంత్రి అనిత కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అందుకే సత్యసాయి జిల్లాలో జరిగిన అత్యాచార ఘటనలో అత్యంత వేగంగా విచారణ కోసం దొరికిన 5 గురు నిందితుల్లో ఒకరిపై 37 కేసులు ఉన్నాయని, అతనిపై అత్యాచార ఆరోపణలు కూడా ఉన్నాయని, అందుకే త్వరితగతిన విచారణకు ప్రత్యేక కోర్టుకు అప్పగిస్తున్నామని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. సత్యసాయి జిల్లాలో ఈనెల 12 వతారీఖున అత్తాకోడళ్లు సామూహిక అత్యాచారానికి గురయ్యారని.. సంఘటన జరిగిన 48 గంటల్లోనే పోలీసులు నిందితులను పట్టుకొని రిమాండు విధించారని హోంమంత్రి అనిత తెలిపారు. మహిళల భద్రత విషయంలో ఈ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, ఆడపిల్లపై నేరం చేయాలనే ఆలోచన వస్తేనే భయం వేసే పరిస్థితి తేవాలని సీఎం చంద్రబాబు సమీక్షలు నిర్వహించారన్నారు. సీసీ కెమెరాలు బద్దలు కొట్టినా వారిని రెండు వందల కిలోమీటర్లు చేజ్ చేసి కొండలు గుట్టల్లో కూడా వెతికి 48 గంటల్లో పట్టుకున్నారని చెప్పారు. వారంతా నేరచరిత్ర కలిగిన వ్యక్తులని.. నిందితుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నారని.. వారిలో ఉన్నవారిపైనా చాలా కేసులు ఉన్నాయన్నారు.ప్పనిసరిగా శిక్షపడుతుందనే ఆలోచన వస్తేనే ఇలాంటి కేసులు తగ్గుతాయని హోంమంత్రి అనిత అభిప్రాయపడ్డారు. ఇలాంటి కేసులు వస్తే వాటిని స్పెషల్ కోర్టులకు పంపుతామన్నారు. గత ప్రభుత్వంలో ఒక రిక్రూట్‌మెంట్ ఒక్కటి కూడా జరగలేదని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే కానిస్టేబుల్ రిక్రూట్ మెంట్ చేస్తున్నామన్నారు. దసరా సమయంలో, ఆ తరువాత భనానీల రాక విషయంలోనూ పోలీసులు గొప్పగా పనిచేశారని హోంమంత్రి అనిత కొనియాడారు.

## నటి జెత్వానీ కేసులో పోలీసుల ముందస్తు బెయిల్ విచారణ జరిపిన కోర్టు... కేసు 23కు వాయిదా

అమరావతి, (ప్రజా మంటలు): ముంబై నటి జెత్వానీ కేసులో పోలీసు అధికారుల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. కేసును తాజాగా సీఐడీకి అప్పగించారని , కౌంటర్లు వేసేందుకు సమయం ఇవ్వాలని కోర్టును పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభ్యర్థించారు. కేసు డిస్పోజ్ అయ్యే వరకు పోలీస్ అధికారులకు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు అమలయ్యే విధంగా చూడాలని పిటిషనర్‌ల తరపున న్యాయవాదులు అభ్యర్థించారు. ఈ అంశాలను నోట్ చేసుకున్న న్యాయస్థానం.. కేసు తదుపరి విచారణను ఈనెల 23కు వాయిదా వేసింది. కాగా.. నటి జెత్వానీ కేసు విచారణను సీఐడీకి అప్పగిస్తూ ఇటీవల డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును విజయవాడ పోలీసులు దర్యాప్తు చేయగా... సీనియర్ పోలీసు అధికారులు నిందితులుగా ఉండటం, ముంబై లింక్‌ల నేపథ్యంలో సీఐడీకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ప్రథమ నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో నిందితులుగా ఉన్న అప్పటి విజయవాడ సీపీ క్రాంతి రాణా, డీసీపీ విశాల్ గున్ని, దర్యాప్తు అధికారి సత్యనారాయణ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వైసీపీ హయాంలో జెత్వానీపై కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదు చేయగా.. దాని ఆధారంగానే విమానంలో వెళ్లి మరీ ఆమెను విజయవాడకు తీసుకొచ్చారు. దీంతో తప్పుడు కేసు పెట్టి, అరెస్టు చేసి ఇబ్బందులకు గురి చేశారని జెత్వానీ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



## కుమ్మరి గూడ ఘటన ఇంటిలిజెన్స్ వైఫల్యమే

### మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి

సికింద్రాబాద్, అక్టోబర్ 15 (ప్రజామంటలు) :

సికింద్రాబాద్ లోని కుమ్మరిగూడ ఘటనకు కారణం రాష్ట్ర ఇంటిలిజెన్స్ పోలీసులు వైఫల్యం అని మాజీ మంత్రి, ఎన్డీఎమ్ఏ మాజీ ఉపాధ్యక్షులు మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం కుమ్మరిగూడ లోని ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించి, స్థానికులను దాడి గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మర్రి శశిధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...సిటీలో ఇటీవల వరసగా హిందూ దేవాలయాలపై దాడులు జరగడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు హిందువుల మనోభావాలను గాయపరచడమే అని అన్నారు.ఇలాంటి ఘటనలు చూస్తుంటే బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాల్లో జరిగే ఘటనలు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక, మాజీ కార్పొరేటర్ వసంత యాదవ్, నాయకులు శరత్ సింగ్ ఠాకుర్, ఆకుల ప్రతాప్, దయానంద్ రావు, నర్సింగ్ రావు, రమేశ్, శ్రవన్, ప్రవీన్, గుంటి సత్యానారాయణ, సగత్ వాళ్ళ వంశీ, రఘునాథ్ గౌడ్, కిరీట, మంచాల గోపి, వికాస్, నరేశ్, పిట్ల శ్రీనివాస్, స్వామి, నర్సింగ్ రావు బొజ్జ, పాల్గొన్నారు.

## నిరాశ్రయులు, అనాథల కోసం 262వ అన్నదాన కార్యక్రమము

సికింద్రాబాద్, అక్టోబర్ 15 (ప్రజామంటలు) :



రాష్ట్ర రాజధాని భాగ్యనగరంలో వివిధ ప్రాంతాలలో రోడ్ల పక్కన ఫుట్ ఫుట్ పాత్ల మీదనే జీవనం సాగిస్తున అనాథలు, నిరాశ్రయులను గుర్తించి ఆహారం అందిచాము. ఈ నిరాశ్రయులకు ఆశ్రయం కలిపించి జీవనోపాధి పొందేలా స్వయం ఉపాధి పథకాలను అమలు పరచి వారి జీవితాలలో మార్పుకి నాంది పలకాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ 262వ అన్నదాన కార్య క్రమములో ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, సభ్యులు అఖిల్, ఇఫ్రాన్, ఖుషి కోమల్ మొదలగువారు పాల్గొన్నారు.

## అర్థరాత్రి ఆటో ఎక్కిన యువతిపై అత్యాచారం

### ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

హైదరాబాద్, (ప్రజా మంటలు):

తనపై ఆటో డ్రైవర్ మరొకరు కలిసి అత్యాచారం చేశారని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనపై ఇద్దరు యువకులు అత్యాచారం చేసినట్లు ఫిర్యాదులో యువతి పేర్కొంది. అత్యాచారం చేసిన అనంతరం ఆటో డ్రైవర్‌తో పాటు అతడి స్నేహితుడు పారిపోయినట్లు తెలిపింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అత్యాచారానికి పాల్పడిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువతిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అయిన ఓ యువతి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. కానీ అదే ఆమె జీవితాన్ని నాశనం చేస్తుందని ఆయువతి ఊహించి ఉండదు. ఆర్సీపురం నుంచి గచ్చిబౌలి వెళ్లేందుకు యువతి ఆటో ఎక్కింది. అయితే యువతిపై కన్నేసిన ఆ ఆటో డ్రైవర్ ఆమెను నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అతడితో పాటు ఇంకో వ్యక్తి కూడా ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చీకటి ప్రదేశానికి తీసుకువెళ్లి ఆటలో ఇద్దరు యువకులు అత్యాచారం చేశారు. మసీద్ బండ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆపై ఆ ఇద్దరు యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ గటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## రాడార్ కేందరం ఏర్పాటుపై రాజకీయమా

### కెటిఆర్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి

హైదరాబాద్, (ప్రజా మంటలు):



తెలంగాణకు గర్వకారణమైన రాడార్ ప్రాజెక్టుపై భారాస, కేసీఆర్ కుటుంబం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మండిపడ్డారు. భారాస అధికారంలో ఉన్నప్పుడే దీనికి సంబంధించిన జీవోలు ఇచ్చారని గుర్తు చేశారు. భారాస అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక మాట మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేవీ రాడార్ స్టేషన్‌కు సహకరించాల్సింది పోయి వ్యతిరేకంగా పోరాటం చేస్తామంటున్నారని విమర్శించారు. దేశ భద్రత, సమగ్రతకు వ్యతిరేకంగా పోరాటం చేస్తారా..? అని నిలదీశారు. రక్షణ శాఖకు సంబంధించిన షిప్స్‌ను కమ్యూనికేట్ చేసే రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణకు ఎంతో పేరు వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు జిల్లా అటవీ శాఖ నుంచి కేంద్ర పర్యావరణ శాఖ వరకూ అన్ని అనుమతులు పొందిందని చెప్పారు.

# వైద్య శాస్త్రంలో అద్భుతం అనస్థీషియా ఆవిష్కరణ



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ప్రపంచ అనస్థీషియా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 16న నిర్వహించ బడుతుంది. తొలిసారిగా అనస్థీషియా (మత్తుమందు) ఇచ్చి శస్త్రచికిత్స చేసిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ప్రపంచ అనస్థీషి యాలజిస్టుల సంఘం ద్వారా ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్16 న జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ ఆఫ్ అనస్థీషియాల జిస్టుల ద్వారా ప్రతి సంవత్సరం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని జరుపుకునే క్రమంలో 150 కంటే ఎక్కువ దేశాల నుండి అనస్థీషియా లజిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 134 కంటే ఎక్కువ సంఘాలు పాల్గొంటాయి.

పూర్వకాలంలో శస్త్ర చికిత్స అనంతరం పుట్టే నొప్పిని తగ్గించేదిగా ఆల్కహాల్ (మదిర) ను గుర్తించి శస్త్ర చికిత్స చేయించుకునే రోగికి ...6వ శతాబ్దానికి చెందిన ఆయుర్వేదానికి చెందిన శస్త్ర చికిత్సకుడు, అపర ధన్వంతరి సుశ్రుతుడు సురాపానం చేయించే వాడు. భరించలేని చాలా నొప్పికి ఉప శమనంగా వైద్యులు, నర్సులు కాకుండా ఇతర మనుషులు గట్టిగా పట్టుకుంటే శస్త్ర చికిత్స చేసేవారు. అమెరికాలోని మసెచ్యూసెట్ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16వ తేదీన విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు గిల్బర్ట్ అబోట్ అనే రోగిపై ఈథర్ వాయువును ప్రయోగించారు.

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మసాచుసెట్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16న గిల్బర్ట్ అంబార్టు గొంతుకు శస్త్రచికిత్స చేసేందుకు... విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు ప్రముఖ

## అక్టోబర్ 16...ప్రపంచ అనస్థీషియా దినోత్సవం

దంత వైద్యుడు జాన్‌కొలిన్స్‌తో కలిసి ఈథర్ మత్తు మందు ఇవ్వగా, హార్వర్డ్ మెడికల్ స్కూల్ మొదటి డీన్ అయిన జాన్ కాలిన్స్ వారెన్, అబాట్ మెడలోని కణితి భాగాన్ని నొప్పిలేకుండా తొలగించగా, అలా దిగ్విజయంగా ఆపరేషన్ చేశారు. ఈథర్. సల్ఫ్యూరిక్ యాసిడ్, ఆల్కహాల్ మిశ్రమాన్ని సంశ్లేషణను ఇందుకు ఉపయోగించారు.1860ల నాటికి మత్తు మందు విస్తృతంగా వాడకంలోకి వచ్చింది. 1860ల్లో యాంటీ సెప్టిక్ పద్ధతుల కనిపెట్టిన తర్వాత ఆపరేషన్లు మరింత సులువుగా మారాయి.

ఈ పరిణామం వైద్యశాస్త్రంలో అద్భుతం ఆవిష్కరించడమే గాకుండా మత్తు వైద్య విభాగంలో విప్లవాత్మ కమైన మార్పులకు నాంది పలికింది. ఇది వైద్య చరిత్రలోని అత్యంత ముఖ్యమైన సంఘటనలలో ఒకటిగా నిలిచి పోయింది. ఆ విజయాన్ని పురస్కరించుకుని అప్పటి నుంచి ఏటా అదే రోజున ప్రపంచ అనస్తీషియా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. సాధారణ మత్తు (అనస్థీషియా) ను నియంత్రితంగా స్పృహను కోల్పోయేలా చెయ్యడానికి ఉపయోగిస్తారు, దీనిని శస్త్రచికిత్సలు నిర్వహించవలసిన అవసరం ఉన్నపుడు ఉపయోగిస్తారు. అనస్థీషియా వైద్య ప్రయోజనాల కోసం ఇవ్వబడేది, ఇది తాత్కా లికంగా స్పర్శను అలాగే స్పృహను కోల్పోయేలా చేస్తుంది. ఆపరేషన్ సమయంలో అనస్థీషియా ఉపయోగించడం వల్ల రోగి నిద్రాణ స్థితిలో ఉంటాడు. నరాల ద్వారా సంకేతాలు బదిలీకావడాన్ని అనస్తీటిక్స్ నిరోధిస్తాయి, తద్వారా మెదడు నొప్పిని గుర్తించే అనుభూతిని నిరోధిస్తాయి. ఆపరేషన్ సమయం, శరీర భాగం, వైద్య పరిస్థితి, రోగి వయస్సు తదితరాలను బట్టి మత్తు ఇచ్చే విధానాన్ని ఎంపిక చేసుకుంటారు. సాధారణ అనస్థీషియాలో... రోగులు అపస్మారక స్థితిలో ఉంటారు, ఏమీ అనుభూతి చెందరు. స్థానిక అనస్థీషి యాలో... రోగి శస్త్రచికిత్స సమయంలో మెలకువగా ఉంటాడు, నిర్ణీత ప్రాంతాన్ని తిమ్మిరి చేయడానికి మందులు ఇంజెక్ట్ చేయ బడతాయి. ప్రాంతీయ అనస్థీషియాలో... రోగులు మేల్కొని ఉంటారు. శరీర భాగాలు తిమ్మిరిగా ఉంటాయి. మానిటర్డ్ అనస్థీషియా కేర్ అనేది స్థానిక అనస్థీషియాతో పాటు మత్తు, అనల్జీసియాతో పాటుగా డయాగ్నస్టిక్ లేదా థెరప్యూటిక్ విధానాల కోసం సురక్షితమైన విధానంగా మత్తు, రోగి యొక్క ఆందోళనను తగ్గించే చర్యలు, సమర్థవంత మైన నొప్పి నియంత్రణకు ఉపకరిస్తుంది.

బాయల్స్ అనే అనస్థీషియా మిషన్ కనిపెట్ట బడ్డాక, ఈ మిషన్ అనస్థీషియా విభాగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకు వచ్చింది. దీని ద్వారా ఏకకాలంలో ఒకటి కంటే ఎక్కువ అనస్థీషియా వాయువులను నిర్దిష్టమైన ప్రమాణంలో రోగి శరీరంలోకి పంపించడానికి అవకాశం ఉంటుంది. మత్తుమందు డాక్టర్లు ఉపయోగించే అనేక పరికరాలు రోగి పల్స్, బీపీ, ఆక్సిజన్ స్థాయిలు, కార్బన్‌డైయాక్సైడ్లను నిరంతరం పర్యవేక్షించడానికి సాయం చేస్తున్నాయి.

రోగులకు ఆపరేషన్లు నిర్వహించడంలో అనస్థీషియా వైద్యులే కీలక పాత్ర పోషిస్తారు. చిన్న శస్త్ర చికిత్సలు మొదలు కొని అతి క్లిష్టమైన మెదడు, గుండె, ఊపిరి తిత్తులు, కాలేయం, మూత్ర పిండాలు, అవయవాల మార్పిడి, కీళ్ల మార్పిడిని సునాయసంగా చేస్తున్నారు. అంటే ఐసీయూ, ప్రకృతి వైపరీత్యాలు, దీర్ఘకాలిక నొప్పుల నివారణలోనూ అనస్థీషియా వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. రోగులకు శస్త్ర చికిత్సకు ముందు సంరక్షణకు అనస్థీటిస్టులు బాధ్యత వహిస్తారు. ఆపరేషన్ థియేటర్లలో రోగికి మత్తు ఇవ్వడమే గాక అత్యవసర విభాగాల్లో వెంటిలేటర్ ద్వారా కృత్రిమ శ్వాస అందించడం, ఆఖరి క్షణాల్లో రోగులకు శ్వాస, రక్త ప్రసరణ పునరుద్ధరించడం లో మత్తు వైద్యసేవలు ప్రధాన భూమిక పోషించడం ద్వారా క్రిటికల్ కేర్ విభాగంలో కీలకంగా మారింది. ప్రమాదాలు సంభవించి నప్పుడు ట్రామాకేర్ లోనూ, ప్రకృతి విలయాల్లోనూ, మాస్ క్యాజువాలిటీల్లో ముఖ్య భూమిక పోషించడం ద్వారా వైద్యరంగంలో అనస్థీషియా వైద్యులు కీలకంగా మారారు.

## అసమతుల్యం

అంతా అగమ్యగోచరం,
అయోమయం.
అర్థంకావటంలేదు నేటి
వాతావరణ పరిస్థితులు.
తుఫానులు, వరదలు,అకాలవర్షాలు
అతివృష్టి ,అనావృష్టులు.

ఒకే రోజులో... భానుని భగభగలు
మరి కొద్దిసేపట్లోనే
వరుణుని విజృంభణ
ఆ వెంటనే మళ్ళీ
చండమయూఖుని తీవ్రత,మళ్లీ...

కాలుష్యకోరలలో చిక్కుకున్న
ప్రకృతి చేస్తోన్న విలయతాండవంతో
అతలాకుతలమవుతోంది
జనజీవనం.

మరోపక్క...
నశిస్తున్నాయి నైతిక విలువలు,
ప్రబలుతున్నాయి అరాచకాలు,
కనుమరుగవుతున్నాయి,
అనుబంధాలు,ఆత్మీయతలు.

ఒకనాటి సంస్కృతీసంప్రదాయాలు,
ఆచారవ్యవహారాలు మసకబారి
ఎటుపోతోందో నేటి సమాజం
అనిపిస్తోంది.
క్రమశిక్షణారాహిత్యమంతటా
న్యాయధర్మాలకు తావేలేదు ఎచ్చటా!
ఏమిటో ఇదంతా!

పర్యావరణం పరిరక్షితమై,
ప్రకృతి ఆనందించేదెన్నడో?
నిష్కల్మషప్రేమానురాగాలతో,
జనజీవనం పరిఢవిల్లేదెప్పుడో?

వేమూరి శ్రీనివాస్
తాడేపల్లిగూడెం, 9912128967

## పిడికిలి పగిలి

ఓ మేధావి
గొంతు అనాధగా
హక్కు కన్ను మూసి

ఉద్యమం పిడికిలి పగిలి
అడవి, మైదానం, ఆకాశం, నేల
మనసు చెల్లాచెదురై

దేశమంతా
మౌనం ముసురు పట్టి
జోరుగా కన్నీటి వానలో

జీవితం ఊపిరి కట్ట తెగి
మేధావి విలువ
కోసుకుపోయింది

చందలూరి నారాయణరావు
9704437247

# ఎపిని నిలబెట్టేలా సాయం అందాలి

**విబజన సమస్యలపై చిత్తశుద్ది కావాలి**

**పోలవరం, అమరావతికి త్వరగా సహకరించాలి**

విజయవాడ,అక్టోబర్15 (ప్రజామంటలు): ఎన్డీఎలో ఉంటూ ఎంతోకాలంగా బిజెపితో చెలిమిగా ఉంటున్న అనేక పార్టీల్లో ఇప్పుడు అసంతృప్తి రగులుతోంది. దేశంలో పరిస్థితులపై ఎన్డీఏ పక్షాలతో చర్చించే అవకాశం లేదు. చర్చిద్దామని అడిగే ధైర్యం ఆయా పార్టీలు చేయడం లేదు. ఈ పార్టీలన్నీ రేపు ప్రజల ముందు సంజాయిషీ ఇచ్చుకోక తప్పదు. మోడీ వ్యవహార శైలిని గట్టిగా విమర్శిస్తూ సవాల్ విసిరిన పార్టీలు అడ్రస్ లేకుండా పోయాయి. ఎపిలో టిడిపి మళ్లీ ఎన్డీయే కూటమితో జతకట్టి, కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కూటమి నుంచి బయటకు వెళితే తమకు పుట్టగతులు ఉండవన్న భయం కూడా ఆయా పార్టీల్లో ఉండివుంటుంది. బీజేపీ వైఖరిపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం అవుతున్నా బయటపడడం లేదు. కేంద్రంలో బీజేపీ మూడో పర్యాయం అధికారానికి వచ్చినప్పటి నుంచీ ఆయా పార్టీల్లో అసంతృప్తి రగులుతున్నది. నిజానికి అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్ర మోదీ తీసుకున్న గొప్ప నిర్ణయాలు ఏమీ లేవు. యూపీఏ పాలనలో చోటుచేసుకున్నాయని చెబుతున్న అవినీతి కుంభకోణాలతో ప్రజలు విసుగెత్తి ఉండటాన్ని గమనించిన మోదీ, అవినీతిపై యుద్ధం ప్రకటిస్తున్నానని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో పెద్దనోట్లను రద్దు, జీఎస్టీని అమలులోకి తెచ్చారు. ఈ రెండు నిర్ణయాలు దేశ ప్రజలను అగాథంలోకి నెట్టాయి. ఈ దశలో విభజన సమస్యలను పెడచెవిన పెట్టిన కేంద్రం తీరుపై ఎపి నేతలు రిగిలిపోయారు. రాజకీయ పార్టీల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజలు మాత్రం తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తున్నారు. భారతీయ జనతా పార్టీ తమకు తీవ్ర అన్యాయం చేసిందని రగిలిపోతున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేయగా, ఇప్పుడు భారతీయ జనతా పార్టీ అంతకంటే దారుణంగా వ్యవహరిం చిందనీ, నమ్మించి గొంతు కోసిందని విమర్శలు వెల్లువెత్తున్నాయి. నిధుల కేటాయింపులు, నీళ్ల పంపకాల్లో తెలంగాణ ప్రభుత్వం కూడా అసంతృప్తి వ్యక్తంచేసి ఎదురుదాడి చేస్తోంది. తెలంగాణ ప్రజల కోరిక మేరకు రాష్ట్ర విభజనకు పూనుకున్న ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం, తమను దిక్కులేని వారిని చేసిందన్న ఆవేదన ఏపీ ప్రజలలో ఏర్పడింది. ఆ కారణంగానే నరేంద్ర మోదీ,చంద్రబాబు జంట అధికారంలోకి వస్తే తమకు న్యాయం జరుగుతుందని ఆశలు పెంచుకున్నారు. కానీ అడియాశలు అయ్యాయి. పదేళ్లు గడిచినా ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో కేంద్రం నుంచి రాష్ట్రానికి సహాయం అందడంలేదు. ఏపీకి ప్రత్యేక హోదా లభిస్తే పరిశ్రమలు వచ్చి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజానీకం ఆశించింది. అయితే మోదీ ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రత్యేక ప్యాకేజీ పేరుతో ఊరించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత మళ్లీ కొంత విదిల్చడం మొదలయ్యింది. అయితే పెద్దగా పనులు సాగేలా మాత్రం నిర్ణయాలు తీసుకోవడం లేదు. ఇందులో భాగంగా పోలవరం ప్రాజెక్టుకు నాబార్డ్ ద్వారా నిధులు అందించాలన్న నిర్ణయం తీసుకున్నారు. పోలవరం, విశాఖ రైల్వే జోన్, రాజధాని వంటి అంశాలపై మళ్లీ కదలిక వస్తోంది. ఈ ఐదేళ్లలో గణనీయంగా ఆర్థిక సాయం అందితేనే ఎపికి బలం చేకూరుతుంది. అలాగే ఉబయ తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధికి అడుగులు పడాలి.

# సమిష్టి నిర్ణయాలకు మోడీ పాతర

మరోమారు పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగబోతున్నాయి. మొన్నటి హర్యానా, కాశ్మీర్ ఎన్నికల్లో మాత్రం బిజెపి హర్యానాలో అధికారం నిలబెట్టుకుంది. ఇప్పుడు మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు రాబోతున్నాయి. త్వరలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగనున్నాయి. ఇదే క్రమంలో జమిలి ఎన్నికలపై ప్రధాని మోడీ పట్టుదలగా ఉన్నారు. ఇలా వరుస ఎన్నికలు నిజంగానే దేశానికి మంచిది కాదు. దేశ ఆర్థిక వ్యవస్థపై ఇవి తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వరుస ఎన్నికలు కేవలం రాజకీయ పార్టీలకు లబ్ది చేకూరుస్తున్నాయే తప్ప ప్రజలకు కాదు. దీనిపై ఆలోచన చేసి త్వరగా నిర్ణయం తీసుకోవాల్సిందే. ఇకపోతే ప్రధాన నిర్ణయాలన్నీ ఏకపక్షంగా తీసుకోవడం సరికాదు. మిత్రపక్షాలతో పాటు, అఖిలపక్షంలో కూడా చర్చించి నిర్ణయాలు తీసుకుంటే మంచిది. ఇలా ఓ మంచి సంప్రదాయానికి మోడీ శ్రీకారం చుట్టాలి. విపక్షాల అభిప్రాయాలు కూడా స్వీకరించాలి. దేశ ఆర్థికపరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. ధరలు విపరీతంగా పెరుగుతు న్నాయి. ప్రజలు బతకలేని దుర్భర పరిస్థితులు తరుముకు వస్తున్నాయి. అయినా పట్టించుకోవడం లేదు. జిఎస్టీ వసూళ్లు పెరగడం ఘనతగా చాటుకుంటున్నారు. ఇకపోతే ప్రధానిగా మోడీ నిర్ణయాలు తీసుకుంటు న్నారే తప్ప వాటి పర్యవసానాలను పరిశీలించడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వాటిని పట్టించు కోకుండా ఆర్థిక సంస్కరణల పేరుతో బురిడీ కొట్టిస్తున్నారు. ఇలాంటి సమస్యలపై ఆర్థిక నిపుణులు, విపక్షాలతో చర్చించాలి. దేశం కోసం సమిష్టి నిర్ణయాలు తీసుకుంటే మంచింది. త్వరలోనే మరిన్ని ఎన్ని కలు రాబోతున్నాయి. ఈ క్రమంలో ప్రజలను బోల్తా కొట్టించే మాటలు తప్ప పటిష్టమైన అభివృద్ది చర్యలు కానరావడం లేదు. పదేపదే కాంగ్రెస్‌ను ఇంకా విమర్శించడం ద్వారా మోడీ తన అసమర్థతను బయట పెట్టుకుంటున్నారు. జిఎస్టీ వాతలు వద్దు బాబోయ్ అంటున్నా మోడీ చెవికెక్కడం లేదు. జిఎస్టీ సామాన్యుల కు మరణశాసనంగా మారింది. దేశంలో పరిస్థితులు ఇలాగే కొనసాగితే సామాన్యులు బతికి బట్టకట్టడం దుర్లభంగా మారనుంది. పెరుగుతున్న ధరలకు తోడు జిఎస్టీ భారాం అంతాఇంతా కాదు. బిజెపిని ప్రజలు నమ్మనంతగా ఇప్పుడు దేశంలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. వ్యక్తిగతంగా నష్టపోయే ప్రమాదేమీ మోడీకి లేకపోవచ్చు. ఆయన పదేళ్ల కాలంలో కార్పోరేట్ కంపెనీలు మరింత బలపడుతున్నాయి. పదేళ్ల క్రితం బిజెపి వస్తే సమస్యలు పరిష్కారం అవుతాయనుకున్న దశలో ..బిజెపి అధికారంలోకి వచ్చినా సమస్యలు మాత్రం మరింతగా చుట్టుముట్టాయి. పదేళ్ల క్రితం అన్ని వస్తువుల ధరలు పోల్చి చూస్తే మనం ఎంతగా పెరిగాయో అర్థం చేసుకోవచ్చు. ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేకుండా పోతోంది. ఇకపోతే బలముందన్న ధోరణిలో మోడీ కూడా మిత్రపక్షాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. మొన్నటి ఎన్నికల్లో కొద్దిమేర ప్రజలు హెచ్చరికలు చేసినా..మోడీ తిరిగి ప్రధాని కావడంతో పాతపద్దతిలోనే ముందుకు సాగుతున్నారు. విపక్షాల వారికి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. సమస్యలపై చర్చించడం లేదు. కనీసంగా ఎన్‌డిఎ పక్షాలతో చర్చించి నిర్ణయాలు తీసుకోవడం లేదు. పూర్తిస్థాయి మెజార్టీ ఉండడం వల్ల నడుచుకున్న తీరుగానే ఇప్పుడు తన పాలనా ధోరణిని కొనసాగిస్తున్నారు. సొంత పార్టీలోనూ మోడీని ఎదరించేవారు లేకపోవడంతో ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.అయితే తనకు తిరుగు లేదన్న ధోరణి ప్రవర్తిస్తే ప్రజలు తమకు అవకాశం వచ్చిన సమయంలో తడాఖా చూపుతారు. అప్పుడు నష్టపోయేది మాత్రం బిజెపియే. రానున్న ఎన్నికల్లో తాయిలాలు ప్రకటించే బదులు ప్రజలు ఏ రకంగా ఇబ్బందులు పడుతున్నారో గుర్తించి నిర్ణయాలు తీసుకుంటే మంచింది. లేకుంటే నడిస్తే నష్టపోయేది బిజెపి మాత్రమే. నియంతృత్వ పోకడలు విడనాడ కుంటే వాజ్‌పేయి, అద్వానీ లాంటి అతిరథ మహారథులు తీర్చిదిద్దిన బిజెపికి ఇక భారతదేశ చరిత్రలో రాజకీయ స్థానం ఉండకపోవచ్చు. అంతిమంగా బిజెపిని నమ్మడం అన్నది ఇక భ్రమ కాగలదు. ఇక దిక్కు లేక మళ్లీ ప్రజలు కాంగ్రెస్‌నో లేదా ఇతర మిత్రపక్షాల కూటమికో అధికారం అప్పగిస్తారు. పప్పుముద్దగా రాహుల్‌ను అభివర్ణించినా...భారత్ జోడో యాత్రతో ప్రజల్లో కదలిక తెచ్చారు. అనూహ్యంగా ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్‌ను తీసుకుని రాగలిగారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కూర్చున్నారు. ఈ ప్రమాదాలను బిజెపి ద్వయం గుర్తించడం లేదు. ఇంకా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ పోవడం కన్నా ప్రజలను గుర్తించి, వారి సమస్యలను ఆకళింపు చేసుకుని పనిచేయడం నేర్చుకోవాలి. ఇకపోతే ఇప్పుడు మోడీని వ్యతిరేకించే పార్టీల్లో ఐక్యత వస్తోంది. ఇది కాంగ్రెస్‌కు వరం కానుంది. వాజపేయి హయాంలో ఎన్డీఏ నిర్మాణం జరిగినా అప్పుడు రాష్ట్రాల నేతలకు విలువ ఉండేది. కానీ మోదీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాధి నేతలకు ప్రాధాన్యం దక్కడం లేదు. చంద్రబాబుకు కొద్దో గొప్పో అవకాశం ఇప్పుడు వస్తోంది. గతంలో ఇలాంటి అవకాశం ఎలాగూ లేదు. కూటమినుంచి పార్టీలు తప్పుకుంటే బీజేపీ ఏకాకి కాక తప్పదు. కూలి పోవడానికి కూడా సమయం పట్టదు. అయితే బిజెపిలో నిర్ణయాలు తీసుకుంటున్న మోడీ, అమిత్‌షాలు దీనిని గుర్తించి పాలనా వ్యవహారాల్లో మార్పులకు సిద్దపడాలి.ప్రధాని మోదీ అనుసరిస్తున్న నిరంకుశ నిర్లక్ష్య వైఖరి నుంచి బయటపడాలి. ఎన్‌డిఎ పక్షాలకు విలువ ఇవ్వడం నేర్చుకోవాలి. మోదీ వైఖరి అంటే



ఇష్టపడని ఎంపీలు, మంత్రులు బీజేపీలో ఉన్నప్పటికీ వారు ప్రభుత్వాన్ని పడగొట్టుకోవాలని అనుకోవడం లేదు. బీజేపీ సంకీర్ణధర్మాన్ని పాటించి, సమిష్టి నిర్ణయాలకు పెద్దపీట వేయాలి. ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న జిఎస్టీ, ధరల వంటి సమస్యలను ఎన్‌డిఎ పక్షాలతో చర్చించాలి. అప్పుడే ప్రజలకు మేలు జరగగలదు.

# పేదలకు మెరుగైన వైద్యం అందించడం మా బాధ్యత

## త్వరలోనే రాష్ట్రంలో పలు చోట్ల ఐవీఎఫ్ సెంటర్ ల ఏర్పాటు

## త్వరలో రెండు వేల కోట్లతో ఉస్మానియాకు కొత్త బిల్డింగ్ పాల్గొన్న మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్






సికింద్రాబాద్ అక్టోబర్ 15 (ప్రజామంటలు) : తెలంగాణ వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకువచ్చి, నిరుపేదలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించడానికి రేవంత్ రెడ్డి సారధ్యంలోని తమ ప్రభుత్వం కట్టబడి ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. మంగళవారం గాంధీ ఆసుపత్రి ఎంసీహెచ్ భవనంలోని ఐవీఎఫ్ సెంటర్ ను మరో మంత్రి పొన్నం ప్రభాకర్, వైద్య శాఖ ఉన్నతాధికారులతో కలసి సందర్శించి, వసతి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం రూ 80 కోట్లతో గాంధీ మెడికల్ కాలేజీ ఆవరణలో నిర్మించతలపెట్టిన 600 మంది సామర్థ్యం కలిగిన మెడికల్ స్టూడెంట్ల రెండు హాస్టల్ భవనాలతో పాటు రెసిడెంట్ డాక్టర్ల వసతి బిల్డింగ్ పనులకు మంత్రులు భూమి పూజ చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఐవీఎఫ్ సెంటర్ లోని పేషంట్లతో మమేకమై మాట్లాడారు.

దేశంలోనే మొదటిసారిగా ప్రభుత్వ సెక్టార్ లో గాంధీ ఆసుపత్రిలో ఐవీఎఫ్ సెంటర్ ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. రాబోవు 15 రోజుల్లో సిటీలోని పేట్ల బురుజు ఆసుపత్రిలో ఐవీఎఫ్ సెంటర్ ను ప్రారంభించనున్నామని ప్రకటించారు. అలాగే నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాల్లో ఐవీఎఫ్ సెంటర్ ల ఏర్పాటుకు కార్యచరణ సిద్దం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో కూడ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి గాను 75 ట్రామా కేర్ సెంటర్లు, ఆరు క్యాన్సర్చికిత్స సెంటర్లను ఏర్పాటుచేసేందుకు ప్రణాళిక సిద్దం చేశామన్నారు. జూడాల చేసిన విజ్ఞప్తికి వెంటనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి స్టూడెంట్ల హాస్టల్ భవనాల కోసం కేవలం రెండు రోజుల్లోనే రూ 200 కోట్లు మంజూరీ చేశారని మంత్రి తెలిపారు. అన్ని వృత్తుల కన్నా వైద్య వృత్తి ఎంతో గొప్పదన్నారు.

ఇది మానవత్వంతో కూడినదని, పేషంట్లకు, డాక్టర్లకు ఉన్న బంధం చెప్పలేనిదన్నారు. దాదాపుగా ఆరు ఏండ్ల క్రితం గాంధీ లో ఐవీఎఫ్ సెంటర్ ను ఏర్పాటు చేస్తాం అని అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, కాని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఐవీఎఫ్ సెంటర్ కు కావాల్సిన మౌళిక వసతులు కల్పించి, దీన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రైవేట్ లో లక్షలాది రూపాయలతో కూడుకున్న సంతాన సాఫల్య కేంద్రం ఇప్పుడు గాంధీలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా లభ్యమవుతుందన్నారు. పేద మహిళలకు తల్లి కావాలనే ఆకాంక్ష గాంధీ లోని ఐవీఎఫ్ సెంటర్ తీర్చనుందన్నారు. ఎన్నికల ముందు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అక్టోబర్ లో 8 కొత్త మెడికల్ కాలేజీలను ఎలాంటి వసతులు లేకుండానే ఆదరబాదరగా పెట్టారన్నారు. గత ఏడు నెలలో కష్టపడి 8 కొత్త మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తెచ్చామన్నారు.

రోజు, రోజుకి క్యాన్సర్, బీపీ, గుండె జబ్బులు పెరుగుతున్నాయన్నారు. సుల్తాన్ బజార్ లో ఐవీఎఫ్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్దం చేయాలని మంత్రి హెల్త్ సెక్రటరీని ఆదేశించారు. ప్రతిష్టాత్మక ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనాన్ని గోషామహాల్ లో దాదాపు 32 ఎకరాల్లో రూ 2వేల కోట్లతో నిర్మించేందుకు త్వరలో శంకుస్థాపన చేయబోతున్నామన్నారు. గాంధీలో ప్రస్తుతం ఉన్న 32 సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు తోడుగా మరిన్ని వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు చక్కటి వైద్యం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హెల్త్ మినిస్టర్ దామోదర రాజ నర్సింహా ప్రత్యేక చొరవ తీసుకొని, నిత్యం యాక్టివ్ గా ఉంటూ వైద్య శాఖ అధికారులతో ఒక ఫ్యామిలిగా ఉంటూ అనేక నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారని కితాబు ఇచ్చారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ రియాజ్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ, డీఎంఈ డా.ఎన్.వాణీ, హెచ్ఎమ్ ఆండ్ ఎఫ్ డబ్ల్యూ కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీజీఎమ్ఎస్ ఐడీసీ ఎండీ హెమంత్, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే. ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, ఆర్ఎంవో వన్ డా.శేషాద్రి, డాక్టర్లు, జూడా యూనియన్ నాయకులు, మెడికల్ స్టూడెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోరుట్ల అక్టోబర్ 15 (ప్రజామంటలు) : ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 1998-2000 విద్యా సంవత్సరానికి చెంది విద్యార్థులు కోరుట్లలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలిసిన పలువురు విద్యార్థులు తమ తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 24 సంవత్సరాల అనంతరం కలిసిన వీరిలో పలువురు రాష్ట్రంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో పని చేస్తుండగా కొందరు వివిధ వ్యాపార రంగాలలో, విదేశాలలో స్థిరపడినట్లు తెలిపారు. ఈ కలయిక మధురస్మృతులను మిగిల్చిందని, ఇలాంటి ఆత్మీయ కలయికలు మునుముందు కూడా ఏర్పాటు చేసుకొని స్నేహ బంధాలను ఇలాగే నిరంతరం కొనసాగించుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో పలువురు చేసిన నృత్య రీతులు అందరినీ ఆకర్షించాయి.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఎల్కతుర్తి, అక్టోబర్ 15 (ప్రజా మంటలు) : ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు కొనుగోలు కేంద్రం వరి కోతలు మొదలు పెట్టక ముందుకే కొనుగోలు కేంద్రం ఏర్పడినందున రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఆయనతోపాటు తహసీల్దార్ జగత్ సింగ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, నాయకులు గోలి రాజేశ్వరరావు, సంతాజీ, పాక రమేష్, శీలం అనిల్ కుమార్, శనిగరపు వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 5 కిలోల కణితి ఆపరేషన్ చేసి పెషెంట్ ప్రాణాలు కాపాడిన డాక్టర్లు



జనగామ అక్టోబర్ 15 (ప్రజామంటలు) : జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన ఇటుకల తబిత (47) గత కొంతకాలంగా అనారోగ్యముతో బాధపడుతూ రవళి నర్సింగ్ హోమ్ హాస్పిటల్ కి వచ్చి డాక్టర్ రాజమౌళి సంప్రదించగా ఇన్వెస్టిగేషన్,,స్కానింగ్, ఎక్స్రే పరీక్షలు చేయించారు. కడుపులో కణతి ఉన్నదని తెలింది. హాస్పిటల్ లో ఆపరేషన్ చేసి కడుపులో ఉన్న దాదాపు బరువు 5 కిలోల 100 గ్రాములు కణతి బయటికి తీశారు. అనస్తీసియా పర్యవేక్షణలో డాక్టర్ రఘు, డాక్టర్ సిహెచ్ రాజమౌళి సర్జన్ అనుమతితో ఆపరేషన్ చేశారు. మోర్తాల ప్రభాకర్, అల్లిసేరి శ్రీనువాస్, అల్వాల రమేష్, కుంటమల్లేష్ సిస్టర్ సరోజన పాల్గొన్నారు.

# "ప్రజావాణి" కి భారీగా తరలివచ్చిన వీఆర్ఏలు

## " ప్రజావాణి " లో అందిన 906 దరఖాస్తులు - ఆర్జీదారుల సమస్యల పరిష్కారం కోసం చిన్నారెడ్డి, దివ్య ప్రత్యేక చొరవ



హైదరాబాద్ అక్టోబర్ 15 (ప్రజామంటలు) : మహాత్మ జ్యోతిబా పూలే ప్రజాభవంలో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీ ఎత్తున విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్ (వీఆర్ఏ) లు తరలివచ్చారు. 61 సంవత్సరాలు పైబడిన 3,797 మంది విఆర్ఏ వారసులకు కారుణ్య నియామకం కోసం జారీ చేసిన జీవో నంబర్లు 81, 85 లను వెంటనే అమలు చేయాలని వీఆర్ఏ లు ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ మోడల్ అధికారి దివ్య లను కోరారు.

వి ఆర్ ఏ ల సమస్యలను చిన్నారెడ్డి దివ్య సానుకో ఓపికగా విని సానుకూలంగా స్పందించారు ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు సబ్ కమిటీ దృష్టికి తీసుకెళ్తామని, సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని వారు హామీనిచ్చారు.

యూరోపియన్ దేశాల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని బంజారాహిల్స్ కు చెందిన ఓ కన్సల్టెన్సీ తమను తమ వద్ద నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసి ముఖం చాటేసిందని బాధితులు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై తక్షణం స్పందించిన చిన్నారెడ్డి హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ కు ప్రత్యేకంగా లేఖ రాసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 906 దరఖాస్తులు అందాయి. గృహనిర్మాణ శాఖ కు సంబంధించి 306, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 138, విద్యుత్ శాఖ కు సంబంధించి 138, మైనారిటీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 134, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సంబంధించి 130, ఇతర శాఖలకు సంబంధించి 192 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

# మాజీ రాష్ట్రపతి ఏపీజే. అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ చేసిన కాంగ్రెస్ నేతలు




కరీంనగర్ అక్టోబర్ 15 (ప్రజామంటలు) : నగరంలో ఈరోజు అంబేద్కర్ నగర్ చౌరస్తా వద్ద సామాజిక కార్యకర్త మహమ్మద్ అమీర్ గారి ఆధ్వర్యంలో మిస్సైల్ మాన్ భారతరత్న, మాజీ రాష్ట్రపతి డా.ఏ.పీ.జే అబ్దుల్ కలాం గారి విగ్రహా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూడ చైర్మన్, కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి మరియు టీపీసిసి అధికార ప్రతినిధి మేనేని రోహిత్ రావు గారు సంయుక్తంగా కలిసి విగ్రహా ఆవిష్కరణ చేశారు. అనంతరం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారు.. దేశం గర్వించదగ్గ నాయకులని మహా మేధావి వారు చేసిన అణు పరీక్షలు భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చాయి వారిని ఆదర్శంగా తీసుకొని అందరూ వారి అడుగుజాడల్లో నడవాలని పేర్కొన్నారు. టిపీసీసీ అధికర ప్రతినిధి రోహిత్ రావు గారు మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చి 77 సం..లలో ఇప్పటి వరకు కరీంనగర్ నగరంలో మైనార్టీ నాయకుని విగ్రహం నగరంలో లేదని ఇదే మొదటి ఒక మైనార్టీ నాయకుని విగ్రహం అని ఏపీజే అబ్దుల్ కలామ్ విగ్రహం పెట్టడం చాలా హర్ష నియమని మరియు ఏపీజే అబ్దుల్ కలాం గారు ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రజ్ఞడని అపర చాణక్యుడని.. వారి కీర్తిని కొనియాడారు..సామాజిక కార్యకర్త విగ్రహా వ్యవస్థాపకులు..మహమ్మద్ అమీర్ మాట్లాడుతూ.. నేను రాహుల్ గాంధీ గారి పాదయాత్ర భారత్ జోడోయాత్ర చేస్తున్న సమయంలో రామేశ్వరం వెళ్లి వారి ఇల్లు,మ్యూజియం, వారి సమాధిని సందర్శించడం జరిగింది అక్కడ వారి గురించి తెలుసుకోవడానికి దేశం ,ప్రపంచం నలు మూలల నుంచి వస్తున్న ప్రజలను చూసి నేను ఆశ్చర్య పోవడం జరిగింది ఒక ముసలాయన కట్టే పట్టుకొని వచ్చి చాలా ఒక భావోద్వేగం తో వారి సమాధిని దర్శించినప్పుడు ఆ ముసలాయన రెండు చేతులు జోడించి..వారి కళ్ళలో నీరు వచ్చింది పక్కనే ఉన్న నేను అది చూసి ఇంత ప్రేమాభిమానాలు పొందిన గొప్ప నాయకుడు ఏపీజే అబ్దుల్ కలాం గారు అని వారి విగ్రహం ఎలాగైనా కరీంనగర్ లో పెట్టాలని అక్కడే నిశ్చయం చేసుకొని రావడం జరిగింది దాదాపు 2 సంవత్సరాల తర్వాత ఈరోజు భారతరత్న అబ్దుల్ కలాం గారి జయంతి సందర్భంగా ఈ రోజు విగ్రహం పెట్టడం చాలా సంతోషమని మహమ్మద్ అమీర్ పేర్కొన్నారు.. కార్యక్రమంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రావణ్ నాయక్, కార్పొరేటర్లు కుర్ర తిరుపతి,ఆర్ష మల్లేశం ,షర్ఫుద్దీన్, మెండి చంద్రశేఖర్,అలీబా, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ ,సమద్ నవాబ్, సయ్యద్ కామారుద్దీన్.. తదితరులు పాల్గొన్నారు.

# రోగులపట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేదే లేదు

- దున్నపోతుపై వర్షం పడినట్టు ఉంది ప్రస్తుత ప్రభుత్వ పరిస్థితి
- ముఖ్యమంత్రికి కోపం ఉంటే మా మీదే చూపించాలి ప్రజల మీద కాదు
- పథకం మార్చిన పరవాలేదు కేసీఆర్ కిట్, కంటి వెలుగు అమలు చేయండి
- హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**హుజురాబాద్ అక్టోబర్ 15 (ప్రజా మంటలు) :** వివిధ ప్రాంతాల నుంచి చికిత్స కోసం నిత్యం వందలమంది ప్రభుత్వాసుపత్రికి వస్తుంటారని, వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేదే లేదని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం హుజురాబాద్ ప్రభుత్వాసుపత్రి ఆకస్మిక తనిఖీ అనంతరం డాక్టర్లు సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణీల పట్ల సోమవారం డాక్టర్లు డెలివరీ నిర్వహించకుండా ఆలస్యం చేయడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. పేదల ఆరోగ్యం కోసమే ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ ఉంటుందని, ఒక్క రోగి కూడా ఆస్పత్రిలో ఇబ్బంది పడకూడదని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నప్పుడు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం పూర్తిస్థాయిలో అందేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ స్థాయిలో చికిత్స అందడం లేదని అన్నారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే దున్నపోతుపై వర్షం పడినట్లుగా ఉందన్నారు. కెసిఆర్ హయాంలో హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకు 200లకు పైగా డెలివరీలు జరిగేవని ప్రస్తుతం ఆస్థాయి గణనీయంగా పడిపోయింది అన్నారు. గత రెండు నెలలుగా ప్రభుత్వ ఆసుపత్రి పై ఒత్తిడి తీసుకురావడంతో డెలివరీల సంఖ్య వందకు పెరిగాయని భవిష్యత్తులో వీటిని 200 పెంచాలని డాక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కోపం ఉంటే కెసిఆర్, బీఆర్ఎస్ నాయకుల మీద తీర్చుకోవాలి తప్పా పేద ప్రజల పైన కాదన్నారు. హుజురాబాద్, జమ్మికుంట ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరతగా ఉందని వెంటనే పూర్తిస్థాయిలో సిబ్బందిని నింపాలన్నారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి ఒక గైనకాలజిస్ట్ తో పాటు అనస్తిష్టను వెంటనే కేటాయించాలని, అలాగే జమ్మికుంట కూడా గైనకాలజిస్ట్ ను నియమించాలన్నారు గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్ తో పాటు డెలివరీ అయిన తర్వాత కెసిఆర్ కిట్ ని కూడా అందించాలన్నారు. కెసిఆర్ కిట్ కి పేరును మార్చిన పరవాలేదని, గర్భిణీ స్త్రీలకు గతంలో మాదిరిగానే ఆడపిల్ల పుడితే 13000 మగ బిడ్డ పుడితే 12000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కంటి వెలుగు కార్యక్రమాన్ని కూడా తిరిగి చేపట్టాలన్నారు. డాక్టర్లపై తమకు గౌరవం ఉందని ఆ గౌరవాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ తనిఖీల్లో ఎమ్మెల్యే వెంట అడిషనల్ . డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ చందూలాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారెడ్డి, ఆర్ ఏం ఓ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గందే రాధిక శ్రీనివాస్ మరియు ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సైబర్ నేరాలపై సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలి

## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్





**మెట్ పల్లి అక్టోబర్ 15 (ప్రజా మంటలు) :** ప్రజలకు సైబర్ నేరాలపై సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.వార్షిక తనిఖీల్లో భాగంగా మెట్ పల్లి సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పి అశోక్ కుమార్ తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మెట్ పల్లి సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డ్స్ ను, పరిసరాలను తనిఖీ చేశారు. సర్కిల్ కార్యాలయానికి సంబంధించిన సర్కిల్ ఇన్ఫర్మేషన్ బుక్ , క్రైం రికార్డు , ప్రాపర్టీ రిజిస్టర్, పిటిషన్ రిజిస్టర్ లను పరిశీలించారు.సర్కిల్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను, పరిశీలించారు. గ్రేవ్ కేసులలో ఫోక్సో కేసులలో నిందితులకు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు. ఎస్ ఓ పి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. 5%o% ఇంప్లిమెంటేషన్ ని పరిశీలించి ఫైలు సక్రమమైన పద్ధతిలో ఉంచాలని, 5%o% ఇంప్లిమెంటేషన్ చేయాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ శాంతి భద్రతల పరిరక్షణకు ఆయా ఎస్సై ల ద్వారా చర్యలు చేపట్టాలని సి. ఐ నిరంజన్ రెడ్డి కి సూచించారు. తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని, సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సూచించారు. సర్కిల్ పరిదిలోని రౌడీ షీటర్లు , హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. కమ్యూనిటీ పోలీసులలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్లలో ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా సి సి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో తెలియజేస్తూ ప్రతి గ్రామం లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా మెట్ పల్లి సర్కిల్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ఉమా మహేశ్వర రావు , డి సి ఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, మెట్ పల్లి సి .ఐ నిరంజన్ రెడ్డి ఎస్సై లు చిరంజీవి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# లష్కర్ సింగారంలో ఎయిడ్స్ అవగాహన సదస్సు



**ఎల్కతుర్తి అక్టోబర్ 15 (ప్రజా మంటలు) :** హనుమకొండ లస్కర్ సింగారం రాజాజీ నగర్ లో లష్కర్ సింగారం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు కార్యక్రమానికి టిబి హాస్పిటల్ ఐసీటీసీ మరియు సంపూర్ణ సురక్ష కేంద్రం సహాకారంతో హెచ్ఐవి/ఎయిడ్స్ మరియు సుఖ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన రక్త పరీక్షలు నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ డా హైదర్ తెలిపారు.అవగాహన కార్యక్రమంలో టీబీ హాస్పిటల్ ఐసీటీసి కౌన్సిలర్ రాపర్తి సురేష్ మాట్లాడుతూ హెచ్.ఐ.వి వ్యాధి పట్ల వలస కూలీలు,హమాలీ వర్కర్స్, మరియు యువత కు హెచ్.ఐ.వి పట్ల అవగాహన కలిగి ఉండడం వల్ల హెచ్.ఐ.వి కి గురికాకుండా చూసుకోవచ్చని, చికిత్స కన్నా నివారణ మంచిదని వారు తెలిపారు. హెచ్.ఐ.వి కేవలం అరక్షిత లైంగిక సంబంధాలు , హెచ్.ఐ.వి ఉన్న గర్భిణీ నుండి పుట్టబోయే బిడ్డకు, హెచ్ఐవితో కలుషితమైన సూదులు సిరంజీలు, పరీక్షింపబడని రక్తము ద్వారా మాత్రమే సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. ఇక ప్రభుత్వ ఆసుపత్రులలో హెచ్.ఐ.వి పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. కౌన్సిలర్ ఆకుల రామ్ కుమార్ మాట్లాడుతూ హెచ్.ఐ.వి. ఉంది అని నిర్ధారణ అయితే జిల్లా వ్యాప్తంగా ఉన్న %ూా=ు% కేంద్రాలు, లింక్ కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయని, మందులు వాడుతూ, వైద్యుల సలహాలు పాటించినట్లయితే ఎటువంటి ఆరోగ్య పరమైన ఇబ్బందులు లేకుండా జీవితం కొనసాగించవచ్చు అని తెలిపారు. హెచ్.ఐ.వి. ఉందనే కారణంతో వివక్ష చూపకూడదు అని, అది హెచ్.ఐ.వి./ ఎయిడ్స్ చట్టం %-% 2017 ప్రకారం శిక్షార్హమైన నేరమని పేర్కొన్నారు. హెచ్.ఐ.వి. పట్ల ఎటువంటి సందేహాలు/ అనుమానాలు ఉన్నా జాతీయ హెల్ప్ లైన్ 1097 కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని తెలియచేసారు. సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ ఇక్బాల్ పాష మాట్లాడుతూ హెచ్.ఐ.వి/ఎయిడ్స్, ఇంటెన్సిఫైడ్ ఐఇసి పై అవగాహనా కార్యక్రమలు హనుమకొండ జిల్లాలో అవగహన సదస్సులు మరియు సేవలు అందించడం జరుగుతుంది. ముఖ్యముగా యువత, మహిళలు, పొదుపు సంఘలు, కార్మికులు , గ్రామా ప్రజలను భాగస్వాములు చెయ్యాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంపూర్ణ సురక్ష కేంద్రం సిబ్బంది, ఎం.సరితా , కే.రాజేంద్ర ప్రసాద్ అర్బన్ వైద్య సిబ్బంది ఏ. బాబు, ఎస్.శ్రీనివాస టి . రవీందర్. ఎస్. శ్రీధర్, ఎస్. సుమలత, %ూచీవీ%, ఆశాలు స్వప్న, లీల లు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



# ఆలయ స్టీల్ రైలింకు సహకరించిన దాత

**కొడిమ్యాల అక్టోబర్ 15 (ప్రజా మంటలు) :** కొడిమ్యాల మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంకు కొడిమ్యాల వాస్తవ్యులు, ముంబాయి లో స్థిరపడిన గుర్రం ఈశ్వరి-కీ.శే:శంకరయ్య పెద్ద కుమారుడు గుర్రం సురేష్-వర్ణ(ఇజ్రాయిల్) కుమారుడు: అక్షయ్ కూతురు: దివ్యల కుటుంబం మహారాజ పోషకులుగా ఆలయ మండపానికి భద్రత నిమిత్తం ఆలయ మండప ఉత్తర మరియు దక్షిణ వైపునకు స్టీల్ రైలింగును 3.50 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయించినారు. దాత తమ్ముడి కుటుంబం గుర్రం శ్రీనివాస్ %-% లలిత,సంతానం శుభం, వనిష పాల్గొన్నారు. ఆలయానికి వస్తు రూపేనా సహకరించిన దాత కుటుంబమునకు ఆలయ అర్చకులు నాగరాజు రమేష్ స్వామివారి తీర్థ ప్రసాదములు అందజేసి మంగళ శాసనములతో ఆశీర్వదించారు. ఆలయ నిర్మాణానికి,అభివృద్ధికి సహకరించిన దాత కుటుంబానికి ఆలయ నిర్మాణ కమిటీ తరఫున, భక్తుల తరఫున, గ్రామస్తుల తరఫున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు,దాత కుటుంబం పాల్గొన్నారు.

# దళిత వర్గాల భూములు లాక్కున్న వారిపై చర్యలు తీసుకోవాలి

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ



**మహాదేవపూర్ అక్టోబర్ 15 (ప్రజా మంటలు) :** మహాదేవపూర్ మండలం లోని అంబటిపల్లి గ్రమం లోని పత్తి సమ్మయ్య చెందిన సర్వే నంబర్ 186/3 లోని 24 గంటల భూమిని కబ్జా చేయాలని చూస్తూ, అగ్రవర్ణాలు దౌర్జన్యం చేస్తే చూస్తూ ఉరుకునేది లేదని బెల్లంపల్లి సురేష్ మాదిగ అన్నారు. ఆయన మాట్లాడుతూ అన్యాయంగా అక్రమంగా అగ్రవర్ణన చెందిన బొంపల్లి లక్ష్మణరావు ఇల్లు కడుతున్న క్రమంలో, వారసత్వంగా సంబంధించిన పత్తి అశోక్ వెళ్లి పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేస్తే తదుపరి నిమిత్తం ఇల్లు అపుమని చెప్పినా, ఆ ఇంటి యజమానికి నోటీసు ఇచ్చిన. లెక్క చెయ్యకుండా కడుతున్న క్రమంలో కార్యదర్శి నుండి ఏం పీ ఓ. డిఎల్పిఓ డిపిఓ. వెళ్లి ఎన్నిసార్లు కంప్లైంట్ చేసిన స్పందించకపోవడం వలన ఒక నిరుపేద సంబంధించిన పత్తి అశోక్ చెందిన కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తుందని తెలిపారు. అగ్రవర్ణ చెందిన బొంపెల్లి లక్ష్మణరావు పైన చట్టపరమైన చర్యలు తీసుకొని, పత్తి అశోక్ సంబంధించిన భూమిని వారికి ఇప్పించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు ఒకవేళ ఇప్పించని యెడల ఎమ్మార్పీఎస్ మండల వ్యాప్తంగా ఎం పీ డి ఓ ఆఫీస్ నుండీ కలెక్టర్ ఆఫీస్ వరకైనా వెళ్ళి ధర్నా కూడా చేస్తామని హెచ్చరించారు కార్యక్రమం లో సీనియర్ నాయకులు నల్లబుగా ధర్మయ్య ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి మంథని రవితేజ మండల అధ్యక్షులు చింతకుంట్ల సదానందం .పత్తి శంకర్. పత్తి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరకు మాన్యపు భుజేందర్ కు ఆహ్వానం



**జనగామ అక్టోబర్ 15 (ప్రజామంటలు) :** ఈనెల 19,20 తేదీలలో ఆంధ్ర ప్రదేశ్ లోని తాడేపల్లి గూడెంలో అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 24 గంటలు ఏకధాటిగా జరిగే సాహిత్య కళాజాతరకు జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామానికి చెందిన శ్రీ పోతన సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మాన్యపు భుజేందర్ కు ఆహ్వానం అందినట్లు బుజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా భుజేందర్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి సాహిత్య కళాజాతరకు ఆహ్వానం అందినందుకు చాలా సంతోషంగా ఉన్నదని అట్లాగే జనగామ జిల్లాలోని కవులు కళాకారులు సాహిత్య అభిమానులు మాన్యపు భుజేందర్ ను అభినందించినట్లు తెలిపారు. అంతర్జాతీయ సాహిత్య కళావేదిక శ్రీశ్రీ కళావేదిక ప్రపంచంలో చాలా పెద్ద సాహిత్య సంస్థని ఎందరో కవులను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్న శ్రీ శ్రీ కళావేదిక నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# అమెరికాతో భారత్ కీలక ఒప్పందం

## - ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుకు ఇరు దేశాల సంతకాలు

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):



సరిహద్దుల్లో చైనా, పాకిస్థాన్‌ల నుంచి నిరంతరం ముప్పు పొంచివున్న వేళ.. సైన్యాన్ని మరింత పటిష్టపరిచేలా భారత్ కీలక ఒప్పందం చేసుకుంది. అమెరికా నుంచి అత్యాధునిక సాయుధ ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలు డీల్‌పై మంగళవారం భారత్ సంతకం చేసింది. ఈ డీల్ కింద మన ప్రభుత్వం మొత్తం 31 ఎంక్యూ9బీ డ్రోన్లను కొనుగోలు చేస్తోంది. వీటికి ప్రత్యేక క్షిపణులు, లేజర్ గైడెడ్ బాంబులను కూడా ఈ జనరల్ అటామిక్స్ సంస్థ సమకూర్చనుంది. ఈ మొత్తం 31 డ్రోన్లలో 15 నౌకాదళానికి, 8 సైన్యానికి, మిగిలినవి వాయుసేనకు కేటాయించనున్నారు. ఈ ఒప్పందం మొత్తం విలువ 3.5 బిలియన్ డాలర్లని తెలుస్తోంది. ఆగస్టులో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఆయన బృందానికి డ్రోన్ సామర్థ్యాలను ప్రదర్శించి చూపించారు. ఇప్పటికే పశ్చిమాసియా, అఫ్గాన్ సంక్షోభాల్లో ఈ డ్రోన్లను విరివిగా వాడారు. ముఖ్యంగా చైనాతో ఉన్న వాస్తవాధీన రేఖ వెంబడి ఉంచేందుకు ఇవి అవసరమని భారత్ భావిస్తోంది. చాలా ఎక్కువ ఎత్తులో విహరించగలిగే ఈ డ్రోన్లు ఏకబిగిన సుమారు 40 గంటలకుపైగా గాల్లో ఉండగలవు. ఇవి నాలుగు హెల్‌ఫైర్ క్షిపణులను, 450 కిలోల బాంబులను మోసుకెళ్లగలవు. ఇప్పటికే భారత్‌లో వీటిల్లో మరోరకమైన సీగార్డియన్ డ్రోన్లను వినియోగిస్తోంది. వీటిని కూడా జనరల్ అటామిక్స్ నుంచి లీజ్‌పై భారత్ తీసుకొంది. ఈ ఏడాది జనవరిలో కాంట్రాక్టు ముగియగా.. మన నౌకాదళం మరో నాలుగేళ్లపాటు దీనిని పొడిగించింది.

# పత్తి ఇంకెప్పుడు కొనుగోళ్లు చేస్తారు?

## - ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

## - ప్రభుత్వ తీరుపై కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):



పత్తి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కారు చెలగాటం ఆడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న పెట్టుబడి సాయం అందించేలేదు, నేడు కష్టపడి పండించిన పంటను పంటను కొనుగోళ్లు చేయరా అని ప్రశ్నించారు. మార్కెట్‌కు దిగుబడి వచ్చినా సీసీఐ కేంద్రాలు ఎక్కడన్నారు. ఇందిరమ్మ రాజ్యమని చెప్పి దళారుల రాజ్యం తెస్తారా అని నిలదీశారు. బడే భాయ్ రాష్ట్రంలో పత్తి రైతుకు పట్టాభిషేకం చేస్తుండగా, ఛోటా భాయ్ పాలనలో మాత్రం పత్తి రైతు చిత్తవుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్‌లో పత్తికి మద్దతు ధరకు మించి రూ.8,257 ఇస్తున్నారని, మరి తెలంగాణలో రేతుకు చెల్లిస్తున్నది కేవలం రూ.5 వేలేనా అని ప్రశ్నించారు. రెండేండ్ల క్రితం పత్తి ధర రూ.10 నుంచి రూ.15 వేలు పలికిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ అనర్థం ఏమిటని ఎక్స్ వేదిగా ఫైర్ అయ్యారు. 'బడా భాయ్ రాష్ట్రంలో పత్తి రైతుకు పట్టాభిషేకం. ఛోటా భాయ్ పాలనలో మాత్రం పత్తి రైతు చిత్తు. గుజరాత్ లో మద్దతు ధరకు మించి రూ.8,257 రేటు. మరి తెలంగాణలో పత్తి రైతుకు కేవలం రూ.5 వేలేనా?. మార్కెట్ కు దిగుబడి వచ్చినా సీసీఐ కేంద్రాలెక్కడ?. ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెస్తారా?. రెండేళ్ల క్రితం పత్తికి 10 నుంచి 15 వేల ధర. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏమిటీ అనర్థం?. నిన్న పెట్టుబడి సాయం అందించలేదు.. నేడు కష్టించి పండించినా కొనుగోళ్లు చేయరా..? పత్తి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కారు చెలగాటం. ముందుచూపు లేని ముఖ్యమంత్రి వల్లే ఈ అన్యాయం.' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

**ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి**

రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గురుకుల భవనాలకు అ÷-దదె చెల్లిస్తలేరు. కాలేజీల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తలేరు. కనీసం అన్నం పెట్టలేని స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారిందని కేటీఆర్ విమర్శించారు. చదువు పక్కనపెట్టి విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు రోడ్లపై ధర్నాలు చేసే దుస్థితి తెచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ ప్రైవేట్ కాలేజీలను నిరవధికంగా మూసివేయటంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించకుండా పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేసే కాంగ్రెస్ సర్కార్ దగ్గర అ÷-దదె, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వటానికి పైసలు లేవా? రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేడు, ముఖ్యమంత్రికి విద్యారంగంలో సమస్యలను తెలుసుకునే ఓపిక లేదు. రాష్ట్రంలో విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాల్సిందిపోయి.. ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపించే పనిలోనే ముఖ్యమంత్రి బిజీగా ఉన్నాడు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాట మాడుతోంది. ఢిల్లీకి మూటలు పంపించటంపై ఉన్న శ్రద్ధ.. విద్యార్థులకు మేలు చేయటంలో లేదా? కాలేజీలు నిరవధికంగా బంద్ చేస్తామని హెచ్చరించినా, సర్కారుకు చీమ కుట్టినట్లైనా లేదా? వెంటనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి. విద్యార్థులకు అన్యాయం చేస్తామంటే బీఆర్ఎస్ సహించదు అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

**ఫాక్స్‌కాన్ ఘనత మాదే**

లక్ష మంది తెలంగాణ యువతకు ఉద్యోగాలు ఇచ్చే ఫాక్స్‌కాన్ కంపెనీని కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మరికొన్ని నెలల్లో కంపెనీ ప్రారంభం కానుండటం గర్వంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టి మరింత విస్తరిస్తారని ఆశిస్తున్నానని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రంగంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన హాన్ హాయ్ టెక్నాలజీ గ్రూప్‌నకు చెందిన ఫాక్స్‌కాన్ తెలంగాణలో రూ.1656 కోట్లకుపైగా పెట్టుబడితో కొంగరకలాన్‌లో పరిశ్రమను నెలకొల్పనుంది. దీనికి సంబంధించి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంతో 2023లో ఫాక్స్‌కాన్ ఒప్పందం చేసుకున్నది. గతేడాది మార్చి 15న కొంగరకలాన్‌లో కేటీఆర్ ఫాక్స్‌కాన్‌కు భూమిపూజ చేశారు. తాజాగా రాష్ట్రంలో తమ కార్యకలాపాలను విస్తరించడానికి సముఖత వ్యక్తం చేసింది.



# ఇరాన్ అణు, చమురు స్థావరాల జోలికెళ్లం

## - నెతన్యాహు ప్రకటన


టెల్‌అవీవ్ (ప్రజా మంటలు):

ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈక్రమంలో ఇరాన్ దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ దాని అణుస్థావరాలను ధ్వసం చేస్తుందా అనే ఆందోళన ప్రపంచవ్యాప్తంగా నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ అణు, చమురు స్థావరాలపై దాడి చేయబోమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో నెతన్యాహు పేర్కొన్నట్లు అమెరికాకు చెందిన పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులు ఫోన్‌లో సంభాషించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఇరువురు నేతలు ఇరాన్‌పై ప్రతీకార దాడులకు సంబంధించిన విషయాలపై చర్చించినట్లు అమెరికాకు చెందిన ఓ అధికారి పేర్కొన్నారు. ఇరాన్ చమురు స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులకు తెగబడితే ఇంధన ధరలు పెరిగిపోతాయని పలువురు విశ్లేషకులు ఆందోళన చెందుతున్నారు. ఇది అమెరికా ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, కావున ఇజ్రాయెల్ ప్రత్యామ్నాయం ఆలోచించాలని నెతన్యాహుకు బైడెన్ సూచించారు. ఆయన సూచనల మేరకు ఇరాన్ చమురు స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులను విరమించుకున్నట్లు తెలుస్తుంది. 'మేము అమెరికన్ ప్రభుత్వ ఆలోచనలు వింటాము. కానీ, ఇజ్రాయెల్ దళాల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటాం' అని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది. నెతన్యాహుకు యూఎస్ విజ్ఞప్తులు ఇజ్రాయెల్‌లోని ప్రజల డిమాండ్‌తో సమానమని ఇజ్రాయెల్‌కు చెందిన ఇంటెలిజెన్స్ మాజీ డైరెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా యూఎస్ ఆయుధాలతోనే ఇజ్రాయెల్ పోరాడుతుందని స్పష్టంచేశారు. అయితే ఈ అంశాలపై వైట్‌హౌస్ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. ఇటీవల ఇరాన్ ఇజ్రాయెల్‌పై క్షిపణల వర్షం కురిపించింది. దాదాపు 180 క్షిపణులతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయెల్ ప్రతిజ్ఞ చేసింది. ఈ క్రమంలోనే ఇరాన్‌కు చెందిన అణు, చమురు స్థావరాలను ఇజ్రాయెల్ ధ్వంసం చేసేందుకు చర్చలు జరుపుతుందనే కథనాలు వెలువడ్డాయి. అయితే అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఇరాన్ అణుస్థావరాలపై కాకుండా ప్రత్యామ్నాయంగా దాడి చేయాలని బహిరంగంగానే ఇజ్రాయెల్‌కు సూచించారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రిలీజ్‌మహారాష్ట్రలో ఒకే విడతలో నవంబర్ 20వ తేదీన, ఝార్ఖండ్‌లో రెండు దశల్లో నవంబర్ 13న తొలి విడత, 20న రెండో విడత ఎన్నికలు నిర్వహించనున్నట్లుగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడించారుమహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ను ప్రకటించింది. మహారాష్ట్రలో ఒకే విడతలో నవంబర్ 20వ తేదీన, ఝార్ఖండ్‌లో రెండు దశల్లో నవంబర్ 13న తొలి విడత, 20న రెండో విడత ఎన్నికలు నిర్వహించనున్నట్లుగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడించారు. రెండు రాష్ట్రాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు నవంబర్ 23న చేపట్టనున్నట్లు తెలిపారు.

# అజ్ఞాతం వీడిన ఖుద్స్‌ఫోర్స్ చీఫ్

## - చాలారోజుల తర్వాత బాహ్య ప్రపంచంలోకి ఇస్మాయిల్ ఖానీ

బీరూట్ (ప్రజా మంటలు):



ఇరాన్‌కు చెందిన అత్యున్నత దళం ఖుద్స్ ఫోర్స్ చీఫ్ ఇస్మాయిల్ ఖానీ చాలారోజుల తర్వాత బాహ్య ప్రపంచానికి కనిపించారు. ఆయన ఓ కార్యక్రమంలో పాల్గొన్న చిత్రాలను ఇరాన్ ప్రభుత్వ టీవీ ప్రసారం చేసింది. కొన్నాళ్లక్రితం ఇజ్రాయెల్ చేసిన దాడిలో ఆయన మరణించినట్లు ప్రచారం జరిగింది. అనంతరం.. ఇరాన్ రహస్యాలను ఇజ్రాయెల్‌కు చేరవేయడంతో ఆయనను అరెస్టు చేసినట్లు వార్తలొచ్చాయి. హెజ్‌బొల్లా చీఫ్ హత్యలో కూడా ఖానీ పేరున్నట్లు కథనాలొచ్చాయి. ఒక దశలో ఇంటరాగేషన్‌లో ఆయన కుప్పకూలినట్లు వీటిల్లో పేర్కొన్నారు. నిన్న ఇరాన్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇవి పూర్తిగా అవాస్తవమని దౌత్యవర్గాలు పేర్కొన్నాయి. ఆయనకు సుప్రీంలీడర్ ఖమేనీ చేతులమీదుగా అత్యున్నత పురస్కారం ఇవ్వనున్నట్లు మరోవైపు ఐఆర్‌జీసీ పేర్కొంది. ఇటీవల మరణించిన ఐఆర్‌జీసీ కమాండర్ అబ్బాస్ నీలోఫరుసన్‌కు సంబంధించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇది ఇరాక్‌లోని కర్బలాలో జరిగింది. ఇరాన్‌కు విదేశాల్లో అవసరమైన ఆపరేషన్లను ఖుద్స్ ఫోర్స్ నిర్వహిస్తుంది. లెబనాన్‌లో హెజ్‌బొల్లా, గాజాలో హమాస్, యెమన్‌లో హుతీలకు ఇది చేదోడువాదోడుగా ఉంటుంది. 2020లో నాటి ఖుద్స్‌ఫోర్స్ చీఫ్ ఖాసీం సులేమానినిపై అమెరికా దాడిచేసి మట్టుబెట్టింది. అనంతరం ఆ బాధ్యతలను ఇస్మాయిల్ ఖానీకి అప్పజెప్పింది. ప్రస్తుతం గాజా, లెబనాన్‌లో జరుగుతున్న యుద్ధాల్లో ఆయనదే కీలక పాత్ర.

# ట్రంప్‌ను ఏమైనా చేస్తే ఊరుకోం

## - అది అమెరికాపై దాడే అవుతుంది

## - ఇరాన్‌కు బైడెన్ సర్కారు హెచ్చరిక

న్యూయార్క్ (ప్రజా మంటలు):

ట్రంప్‌పై వరుస హత్యాయత్నాలతో అమెరికాలోని బైడెన్ సర్కారులో ఆందోళన మొదలైంది. ఇప్పటికే ఆయన ఇరాన్ హిట్‌లిస్ట్‌లో ఉండటంతో టెహ్రాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ట్రంప్‌కు వ్యతిరేకంగా కుట్ర యత్నం చేసినా.. దాన్ని యుద్ధాన్ని ప్రేరేపించే చర్యగానే భావిస్తామని అమెరికా అధికారి ఒకరు పేర్కొన్నారు. ట్రంప్‌నకు ముప్పు అంశంపై జోబైడెన్ నిత్యం అప్‌డేట్లు తెలుసుకోవడంతో పాటు.. తగిన చర్యలకు బృందాన్ని ఆదేశిస్తున్నారని సదరు అధికారి తెలిపారు. ఇరాన్ కుట్రలపై దృష్టిపెట్టాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇరాన్‌లో ఉన్నతస్థాయి అధికారులకు బైడెన్ సూచనల మేరకు ఈ సందేశాన్ని పంపినట్లు తెలుస్తోంది. ట్రంప్ హత్యాయత్నానికి కుట్రలు చేయడాన్ని తక్షణమే ఆపేయాలని కోరినట్లు సమాచారం. అంతేకాదు.. ఏ హత్యాయత్నమైనా జరిగితే దానిని యుద్ధాన్ని ప్రేరేపించే చర్యగానే అమెరికా భావిస్తుందని స్పష్టం చేసినట్లు సమాచారం. మరోవైపు ఇరాన్ తాము అమెరికా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం లేదని స్పష్టంచేసింది. అదే సమయంలో వాషింగ్టన్ మాత్రం తమ అంతర్గత విషయాల్లో ఏళ్ల తరబడి జోక్యం చేసుకొంటోందని ఆరోపించింది. 1953లో తిరుగుబాటు నుంచి 2020 ఖాసీం సులేమానీ హత్య వరకు అమెరికానే చేసిందని ఆ దేశ అధికారులు చెబుతున్నారు. ట్రంప్ స్వయంగా ఖాసీం సులేమానీ హత్యకు ఆదేశాలు జారీ చేశారు. గత నెల ట్రంప్ ప్రచారబృందం ఓ ప్రకటన చేసింది. 'యూఎస్‌లో అస్థిరత, గందరగోళాన్ని సృష్టించాలని ఇరాన్ ప్రయత్నిస్తుంది. మాజీ అధ్యక్షుడు ట్రంప్‌నకు కచ్చితమైన ముప్పు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ కార్యాలయం హెచ్చరించింది' అని ట్రంప్ ప్రచార బృందం ఓ ప్రకటనలో పేర్కొంది. కొన్ని నెలలుగా ఇరాన్ బెదిరింపులు పెరిగిపోయాయని అధికారులు గుర్తించినట్లు తెలిపింది. ఈ హెచ్చరికలపై ట్రంప్ నాడు ఎక్స్ వేదికగా స్పందించారు. 'నా హత్యకు ఇరాన్ ఇప్పటికే చాలా ప్రయత్నాలు చేసింది. అవి ఫలించకపోవడంతో మళ్లీ ప్రయత్నాలు కొనసాగిస్తుంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

# తైవాన్ చుట్టూ చైనా మిలిటరీ విమానాల చక్కర్లు

## ఆందోళన వ్యక్తం చేసిన జపాన్

తైపీ, (ప్రజా మంటలు):

స్వతంత్ర ద్వీపదేశమైన తైవాన్ చుట్టూ 153 చైనా మిలిటరీ విమానాలు చక్కర్లు కొట్టినట్లుగా తైవాన్ రక్షణశాఖ వెల్లడించింది. మంగళవారం ఉదయం 6 గంటల వరకు తైవాన్‌ను చుట్టుముట్టి న విమానాల వివరాలను రికార్డు చేసినట్లు పేర్కొంది. 25 గంటల వ్యవధిలో చైనా నౌకాదళానికి చెందిన 14 నౌకలను నమోదుచేసినట్లుగా తెలిపింది. ఇది అసమంజసమని, సహేతుకం కాదని, రెచ్చగొట్టే చర్యలా ఉందని రక్షణశాఖ ఉన్నతాధికారులు చైనాపై మండిపడ్డారు. గతంలో ఎప్పుడూ ఇలా ఒకేరోజు యుద్ధ విమానాలతో విన్యాసాలు నిర్వహించలేదన్నారు. కాగా తమ దేశానికి చెందిన యోనాగుని ద్వీపం సమీపంలో చైనా కసరత్తులు చేపట్టడంపై జపాన్ ప్రభుత్వం ఆందోళన వ్యక్తంచేసింది. చైనా చేపడుతున్న చర్యలను తాము నిశితంగా పరిశీలిస్తున్నామని జపాన్ డిప్యూటీ చీఫ్ కేబినెట్ సెక్రటరీ కజుహికో అయోకి తెలిపారు. ఈ ఘటనపై తాజాగా అమెరికా స్పందించింది. చైనా చేపట్టిన చర్యల వల్ల ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడింది. బీజింగ్ సంయమనంతో వ్యవహరించాలని పేర్కొంది.

చైనా సోమవారం తైవాన్ చుట్టూ ఆర్మీ, నేవీ, వాయుసేన, క్షిపణి బలగాలను మోహరించి, భారీ సైనిక విన్యాసాలు చేపట్టింది. సముద్ర జలాల్లో విమానవాహక నౌకలను రంగంలోకి దించింది. పొరుగుదేశాన్ని దాదాపు అన్నివైపుల నుంచి దిగ్బంధించినట్లుగా రోజంతా కొనసాగించిన యుద్ధ విన్యాసాలను సాయంత్రానికి ముగించినట్లు చైనా సైన్యం పీఎల్‌ఏ ప్రకటించింది. 'జాయింట్ స్వార్డ్-2024బి' పేరుతో నిర్వహించిన సమీకృత సంయుక్త విన్యాసాల్లో అన్ని విభాగాల శక్తి సామర్థ్యాలను పరీక్షించినట్లు పీఎల్‌ఏ అధికార ప్రతినిధి, సీనియర్ కెప్టెన్ లీ షీ ఓ ప్రకటనలో



# భాజపా సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కె.లక్ష్మణ్

## - నియమించిన పార్టీ అధిష్టానం

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):



దేశ వ్యాప్తంగా భాజపా సంస్థాగత ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ ఎన్నికల నిర్వహణ బాధ్యతలను భాజపా సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్‌కు అప్పగించింది. ఈ మేరకు ఆయన్ను భాజపా సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియమించింది. భాజపా ఉపాధ్యక్షురాలు రేఖా వర్మ, భాజపా లోక్‌సభ ఎంపీ సంబిత్ పాత్రా, రాజ్యసభ ఎంపీ నరేశ్ బన్సల్‌లను సహాయ రిటర్నింగ్ ఆఫీసర్లుగా నియమిస్తూ మంగళవారం భాజపా నోటిఫికేషన్ విడుదల చేసింది. భాజపా జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ నియామకాలకు ఆమోదం తెలిపారు. తెలంగాణకు చెందిన కె.లక్ష్మణ్ ప్రస్తుతం రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. అంతేకాకుండా ఆయన భాజపా ఓబీసీ మోర్చ అధ్యక్షుడిగానూ కొనసాగుతున్నారు. మరోవైపు, భాజపా కొత్త అధ్యక్షుడిని ఎన్నికొనే ప్రక్రియ డిసెంబర్‌లో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగిసి, దాదాపు సగం రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు పూర్తయ్యాక భాజపా నూతన అధ్యక్షుడి ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నిక ప్రక్రియ డిసెంబర్ లేదా వచ్చే ఏడాది ఆరంభంలో మొదలయ్యే అవకాశం ఉంది. మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 2న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com